AKSHITHA TV
ప్రతిక్షణం... ప్రజాపక్షం
epaper.aakshitha.com

www.aakshitha.com
People's voice
# అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY




twitter aashithanews | akshithatelugudaily

బుధవారం, మార్చి 04, 2026 | సంపుటి : 16 సంచిక : 97 | పేజీలు : 10, వెల: రూ.5.00 | Nalgonda, Ranga Reddy, Hyderabad, Khammam, Warangal, Mahabub Nagar, Karim Nagar, Amaravathi, Uttarandhra | చీఫ్ ఎడిటర్ : ఎం.దాస్



# పాలన... పరుగులు

## కలెక్టర్ల పల్లె బాట

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేయాలి

విద్యావ్యవస్థలో మార్పులపై ప్రజలకు అవగాహన

99 రోజుల కార్యాచరణలో అందరూ భాగస్వామ్యం కావాలి

99 రోజులు కలెక్టర్లు జిల్లా వీడి రావద్దు

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు సకాలంలో బిల్లుల చెల్లింపు

సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు



**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :** రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై లబ్ధిదారుల అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సచివాలయంలో కలెక్టర్లతో సీఎం సమావేశమయ్యారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. 99 రోజుల కార్యాచరణలో అందరి భాగస్వామ్యం ఉండాలని సీఎం పిలుపునిచ్చారు. గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలి. విద్యావ్యవస్థలో తీసుకువస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రభుత్వ ఆస్పత్రులను మెడికల్ కాలేజీలతో అనుసంధానం చేయాలి. మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ప్రతినెలా బిల్లులు చెల్లించాలని సీఎం అన్నారు. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో అధికారులు, కలెక్టర్లకు పలు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాధాన్యత అంశాలు, పాలనాపరమైన సంస్కరణలపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.మరోవైపు మిగతా 2లో..

## ఖమేనీ హత్యపై మౌనమేలా?

మోడీ తీరుపై మండిపడ్డ సోనియాగాంధీ



న్యూఢిల్లీ, అక్షిత ప్రతినిధి : ఇరాన్ అధ్యక్షుడు అయాతుల్లా అలీ ఖమేనీ హత్యపై మోడీ ప్రభుత్వం మౌనం వహించడంపై కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ మౌనం వహించడం తటస్థంగా లేదని, బదులుగా ఇది పరాజయమని అన్నారు. భారత విదేశాంగ విధాన లక్ష్యము, విశ్వసనీయతపై సందేహం లేవనెత్తుతోందని అన్నారు. బ్జడెట్ సమావేశాల రెండవ భాగం కోసం పార్లమెంట్ తిరిగి సమావేశమైనపుడు, అంతర్జాతీయ వ్యవస్థ విచ్ఛిన్నంపై ప్రభుత్వ 'ఇబ్బందికరమైన నిశ్శబ్దం' గురించి బహిరంగంగా మరియు ఎగవేయకుండా చర్చించాలని అన్నారు. జాతీయ మీడియాలో ప్రచురితమైన తన వ్యాసంలో సోనియాగాంధీ మాట్లాడుతూ.. నైతిక బలాన్ని మనం తిరిగి కనుగొని దానిని స్పష్టత మరియు నిబద్ధతతో వ్యక్తీకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇరాన్ అధ్యక్షుడు ఖమేనీని హత్య మిగతా 2లో..

## డిమాండ్‌కు తగ్గట్లుగా విద్యుత్ ప్రణాళిక

ఒక్కరోజే 18,139 మెగావాట్ల డిమాండ్

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



హైదరాబాద్, అక్షిత ప్రతినిధి : మంగళవారం ఒక్కరోజే 18,139 మెగావాట్ల డిమాండ్‌ను తెలంగాణ ప్రభుత్వం నెరవేర్చిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక విద్యుత్ డిమాండ్‌ను నమోదు చేసుకుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. వేసవి కాలం నేపథ్యంలో విద్యుత్ వినియోగం గరిష్ఠంగా ఉంటుందని.. అందుకు తగిన అవసరాల కోసం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. తెలంగాణలో రికార్డు స్థాయిలో విద్యుత్ మిగతా 2లో..

## మోడీ, అమిత్ షా కనుసన్నల్లోనే సీబీఐ

ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాలి

పాలకట్లీకి ప్రభుత్వానిదే బాధ్యత

సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ



భద్రాచలం, అక్షిత ప్రతినిధి : భద్రాచలం చుట్టూ ఉన్న ఐదు గ్రామాలను తెలంగాణాకు ఇవ్వాలని సీపీఐ తరపున కోరుతున్నామని సిపి జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. విభజన సందర్భంగా ఎపిలు కలిపిన ఆ ఐదు గ్రామాలు తెలంగాణలో తిరిగి విలీనం చేయాలన్నరు. లేకుంటే తీవ్ర సమస్యలు వస్తాన్నారు.

ధార్మిక సంస్థల్లో కఠినమైన పాలసీలు తీసుకురావటం ద్వారానే లడ్డూ కల్తీ లాంటి సమస్యలు ఆగుతాయని స్పష్టం చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నిజాయితీగా ఉంటే ఎవరూ ఏ చేయలేరని, శ్రీలక్ష్మి చేసిన చిన్న తప్పిదం వలన ఆమె కెరీర్ మిగతా 2లో..

## భారత్ ప్రతిష్టకు భంగం

మోడీ తీరుపై రాహుల్



**న్యూఢిల్లీ, అక్షిత ప్రతినిధి :** అమెరికా-ఇజ్రాయిల్-ఇరాన్‌ల వివాదంపై ప్రధాని మోడీ మౌనం ప్రపంచంలో భారత్ ఖ్యాతిని దిగజారుస్తోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మంగళవారం పేర్కొన్నారు. ప్రపంచక్రమాన్ని నిర్వచించడానికి ఒక మార్గంగా దేశాధినేత హత్యకు మద్దతు ఇస్తున్నారా లేదా అనే దానిపై ప్రధాని మోడీ మాట్లాడాలని, సమాధానం చెప్పాలని అన్నారు. ఇరాన్‌పై ఏకపక్ష దాడులతో పాటు, ఇతర మధ్యప్రాచ్య దేశాలపై ఇరాన్ దాడులను ఖండించాలని ఆయన అన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ అధ్యక్షుడు ఖమేనీని మిగతా 2లో..

## జలసంధి దాటితే నౌకలను పేల్చేస్తాం

హార్మూజ్ జలసంధి మూత

ఎవరైనా వెళితే పేల్చేస్తాం

ఇరాన్ వార్నింగ్‌తో చమురు సంక్షోభం




టెహ్రాన్, మార్చి 3 : పశ్చిమాసియాలో ఘర్షణ వాతావరణం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. ఇప్పటికే ముడి చమురు ధరలు పెరుగుతుండగా.. ఇరాన్ ఇచ్చిన వార్నింగ్ మరింత ఆందోళనకు దారితీస్తోంది. హోర్ముజ్ జలసంధిని మూసివేశామని, నౌకలు దానిని దాటడానికి మిగతా 2లో..

## రాజ్యసభ రేసులో 4గురు బిసి నేతలు

పిసిసి చీఫ్ మహేశ్



**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :** రాజ్యసభ స్థానాలపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమర్థవంతమైన నలుగురు బీసీ నేతలు రాజ్యసభ అవకాశం ఇవ్వాలని అడుగుతున్నారని తెలిపారు. రాష్ట్రం నుంచి ఒకరికి ఇస్తారా? లేదా ఇద్దరికి ఇస్తారా అనేది బుధవారం తెలుస్తుందన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యసభ స్థానం కోసం అడగడం లేదని చెప్పారు. కార్పొరేట్ శక్తులకు బీఆర్ఎస్ రాజ్యసభ మిగతా 2లో..

## అనుభవమే భవిష్యత్తుకు పునాది

ఆలోచనలు, ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేయండి

కలెక్టర్లకు మంత్రి పొంగులేటి




**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :** ప్రభుత్వ ఆలోచనలు, ప్రజల ఆకాంక్షల మేరకు జిల్లా కలెక్టర్లు అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపు నిచ్చారు. ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన మిగతా 2లో..

## ఖజానా నిల్... నేతల జేబులు ఫుల్

అప్పు చేయకుండా పూటగడవట్లే

ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

సీఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి బహిరంగ లేఖ



**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :** అప్పు చేయకుండా పూటగడవని స్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇప్పుడు రాష్ట్ర ఖజానాలో డబ్బు లేదంటూ హామీల అమలుకు తప్పించుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితికి సంబంధించి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని కేంద్రమంత్రి లేఖలో మిగతా 2లో..



## నేడు జైలు నుంచి బాల్క సుమన్ విడుదల

ర్యాలీ కోసం బిఆర్ఎస్ నేతల సన్నాహాలు

మంచిర్యాల, అక్షిత ప్రతినిధి : క్యాతన్‌పల్లి మున్సిపల్ ఎన్నిక సందర్భంగా కేసులతో జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ , బీఆర్ఎస్ నాయకులు బుధవారం విడుదల కానున్నారు. బెయిల్ పిటిషన్ పై సోమవారం వాదనలు విన్న జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. అయితే చెన్నూర్ కోర్టులో ఉన్న మరో కేసులో పీటీ వారెంట్ ఫిటిషన్‌పై విచారణను ఆ కోర్టు ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది. బాల్క సుమన్‌కు ఈ కేసులోనూ బెయిల్ రావాల్సి ఉండటంతో ఐదో తేదీ తర్వాతే ఆయన జైలు మిగతా 2లో..

## మూసీ ఒడ్డున భారీ అక్రమ నిర్మాణం

నార్సింగ్‌లో నిర్మాణంలో ఉన్న వెంచర్ వద్ద ధర్నా

కవిత ధర్నాను అడ్డుకున్న పోలీసులు

హైడ్రాకు అక్రమాలు కనిపించడం లేదా ?




**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :** హైడ్రాకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లు కనిపించడం లేదా అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. నార్సింగిలోని ఓ వెంచర్ వద్ద స్థానికులతో కలిసి ఆమె ధర్నా చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకొని పోలీసు వాహనాల్లో తరలిస్తుండగా.. జాగృతి కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, జాగృతి కార్యకర్తల మధ్య తోపులాట చోటు మిగతా 2లో..

## నేడు జైలు నుంచి బాల్క సుమన్ విడుదల

(మొదటిపేజీ తరువాయి)
నుంచి బయటికి వస్తారని అంతా భావించారు. ఈ నేపథ్యంలో మంగళవారం చెన్నూర్ కోర్టులో పీటీ వారెంట్ ఫిటిషన్ పై విచారణ జరపాలని బాల్కసుమన్ అడ్వొకేట్లు మరో ఫిటిషన్ వేయడంతో కోర్టు విచారణను స్వీకరించింది. బాల్కసుమన్ తరుపు న్యాయవాదులు వాదనల అనంతరం పెట్టిన కేసు బెయిలెబుల్ అఫెన్స్ కావడంతో బెయిల్ మంజూరు చేసింది. దీంతో బాల్కసుమన్ సహా ఆయనతో పాటు అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు జైలు నుంచి విడుదల కానున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేశామని, రేపు ఉదయం 7 గంటలకు బాల్కసుమన్ జైలు నుంచి బయటికి వస్తారని ఆయన తరుపు న్యాయవాదులు తెలిపారు. బాల్కసుమన్ బయటికి రానున్న నేపథ్యంలో చెన్నూర్ లో బీఆర్ఎస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. జైలు నుంచి బయటికి వచ్చిన బాల్కసుమన్ సహా ఇతర బీఆర్ఎస్ నాయకులను వందలాది వాహనాల్లో ర్యాలీగా క్యాతన్‌పల్లికి తీసుకురానున్నారు. వచ్చే మార్గంలో మంచిర్యాల జిల్లా పరిధిలోని ప్రధాన రహదారి మార్గాల్లోని పలు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేస్తూ, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి సుమన్ పూలమాల వేస్తారని అక్కడి నుంచి నేరుగా క్యాతన్‌పల్లిలోని తన నివాసానికి చేరుకుంటారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

## జలసంధి దాటితే నౌకలను పేల్చేస్తాం




(మొదటిపేజీ తరువాయి)
ప్రయత్నిస్తే నిప్పు పెడతామని హెచ్చరించింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, నౌకాదళ సిబ్బంది ఆ పని చేస్తారని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధిని మూసివేశామని, ఆ జలసంధి గుండా వెళ్లేందుకు ప్రయత్నించే ఏ నౌకపై నైనా కాల్పులు జరుపుతామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ ఇన్ చీఫ్ సీనియర్ సలహాదారు ఇబ్రహీం జబారీ ప్రకటించారు. నౌకలు ఈ జలసంధిని దాటడానికి ప్రయత్నిస్తే దాడి చేస్తామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ పేర్కొన్నట్లు అధికారిక మీడియా వెల్లడించింది. ప్రపంచ ఆయిల్ రవాణాలో ఐదవ వంతు ఈ జలసంధి ద్వారానే సరఫరా అవుతుంది. దీంతో ఈ చర్య చమురు ధరలు పెరిగే అవకాశం ఉందని కెప్లర్ గణాంకాలు హెచ్చరించిన సంగతి తెలిసిందే. హోర్ముజ్.. ప్రపంచ ఇంధనానికి జీవనాడి వంటిది. కేవలం కొన్ని కిలోటర్ల వెడల్పు ఉన్న ఈ ప్రదేశం నుంచి ప్రపంచం వాడే చమురులో ఐదోవంతు రవాణా అవుతోంది. ఈ జలసంధిలో ఏర్పడే ఏ అంతరాయం అయినా ప్రపంచ వాణిజ్యాన్ని గజగజ లాడిస్తుంది. ఈ మార్గం నుంచి వచ్చే చమురు, ఎల్ఎన్‌జీ అత్యధికంగా భారత్, చైనా, దక్షిణ కొరియా, జపాన్ దేశాలకు ఎగుమతి అవుతోంది. ఇంతటి కీలకమైన జలసంధి మూసుకుపోతే.. రవాణా, బీమా ఖర్చులు గణనీయంగా పెరుగుతాయి. ఇప్పటికే ఆ ప్రభావం కనిపిస్తోంది. చమురు ధరలు భగ్గుమంటున్నాయి. కాగా.. అమెరికా–ఇజ్రాయెల్ దాడుల్లో తమ సుప్రీంనేత ఖమేనీ మృతి చెందడంతో ఇరాన్ రగిలిపోతోంది. ఈ నేపథ్యంలోనే హోర్ముజ్‌ను మూసివేసినట్లు ప్రకటించింది. డేటా అండ్ అనలిటిక్స్ సంస్థ కెప్లర్ గణాంకాల ప్రకారం.. సుమారు 150 ఆయిల్ ట్యాంకర్లు ఇప్పటికే ఈ హోర్ముజ్ నుంచి వెళ్లేందుకు ఎదురుచూస్తున్నాయి. మరోవైపు హోర్ముజ్ తూర్పువైపున 60 ట్యాంకర్లు వేచిచూస్తున్నాయి. ఇదిలాఉంటే, ఫిబ్రవరి మధ్యలో సైనిక విన్యాసాల కోసం జలసంధిలో కొంతభాగాన్ని ఇరాన్ మూసివేయగా.. అప్పుడు చమురు ధరలు 6 శాతం మేర పెరిగాయి.

## మూసీ ఒడ్డున భారీ అక్రమ నిర్మాణం




(మొదటిపేజీ తరువాయి)
చేసుకుంది. అంతకుముందు మూసి నది పక్కన నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌పై కవిత ఆరోపణలు చేశారు. మధ్యాహ్నం నుంచి ఆ వెంచర్ వద్దే బైఠాయించారు. సాయంత్రం సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులోనే ధర్నా కొనసాగించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ వచ్చే వరకు కదిలేది లేదని స్పష్టం చేశారు. మూసీని ఆనుకుని భారీ రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. పేదల ఇళ్లు

కూలుస్తూ రియల్ ఎస్టేట్‌వెంచర్లను వదిలేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ నార్సింగి పరిధిలోని మూసీ నదిని ఆక్రమించి శ్రీ ఆదిత్య లగ్జరీ అపార్ట్‌మెంట్స్ నిర్మిస్తున్నారని కవిత ఆరోపించారు. నది పరివాహక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఈ వెంచర్ సాగుతోందని ఆమె మండిపడ్డారు. ఈ అక్రమ నిర్మాణాల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ ప్రాజెక్టుపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో సామాన్యుల ఇళ్లను తొలగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఈ భారీ వెంచర్‌ను ఎందుకు చూడటంలేదని ఆమె నిలదీశారు. పేదల గూడు చెడగొట్టే హైడ్రా అధికారులకు ఈ అక్రమ నిర్మాణాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. చట్టం అందరికీ సమానంగా వర్తించాలని, కేవలం పేదలపైనే ప్రతాపం చూపడం సరికాదని కవిత హితవు పలికారు. రియల్ ఎస్టేట్ మాఫియా అండతోనే ఇలాంటి భారీ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆమె విమర్శించారు. సామాన్యుల పక్షాన నిలబడి తమ పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా కవిత స్పష్టం చేశారు. ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆమె గుర్తు చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## మోడీ, అమిత్ షా కనుసన్నల్లోనే సీబీఐ

(మొదటిపేజీ తరువాయి)
దెబ్బతిందన్నారు. బాధ్యతాయుతంగా ఉండాల్సిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రలోభాలకు లొంగడంతోనే వ్యవస్తలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడలో జరిగిన దుర్ఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే అని నారాయణ పేర్కొన్నారు. కల్తీ పాలు తాగటం వలన ప్రజలు చనిపోతున్నారని, డెయిరీలపై ప్రభుత్వ నియంత్రణ ఏమైందని ప్రశ్నించారు. నక్సలైట్లను చంపవచ్చు కానీ నక్సలిజాన్ని అంతం చేయలేరన్నారు. పేదరిక నిర్మూలన జరిగితే నక్సలిజం అవసరమే రాదన్నారు. అరవింద్ కేజ్రీవాల్‌ను అణగదొక్కాలని అవినీతి మరక అంటించారని ఆరోపించారు. ప్రధాని మోడీ, అమిత్ షా కనుసన్నల్లోనే సీబీఐ పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వానికి కూటమి ప్రభుత్వానికి తేడా ఏ లేదన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు ఆరు వేల కోట్లు ఉన్నాయని.. రెండు వేల కోట్లు విడుదల చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. అగ్రిగోల్డ్ కేసును సీఎం చంద్రబాబు మధ్యవర్తిత్వానికి అప్పగించాలని నారాయణ కోరారు. అమెరికాకు ఎవరు ఎదురు తిరిగినా వారిపై ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దాడులకు దిగడం దారుణమని సీపీఐ జాతీయ నేత నారాయణ అన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల యుద్ధం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇరాన్ తన స్వయం ప్రతిపత్తిని కాపాడుకునే ప్రయత్నంగా యుద్ధం చేస్తుందన్నారు. దురాక్రమణ చేసేందుకే పలు కారణాలు చూపి యుద్ధం ప్రారంభించిందని అమెరికాపై మండిపడ్డారు. ప్రధాని మోడీ చొరవ తీసుకుని ప్రపంచ దేశాల సమన్వయంతో ట్రంప్‌తో మాట్లాడి యుద్ధం ఆపేలా ప్రయత్నం చేయాలని కోరారు.

# పాలన...పరుగులు



(మొదటిపేజీ తరువాయి)
పలువురు కలెక్టర్లపై సీఎం సీరియస్ అయ్యారు. కొంత మంది కలెక్టర్లు జిల్లా హెడ్ క్వార్టర్ లో ఉండటం లేదన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. అలాంటి వారు తమ పని తీరు మార్చుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 99 రోజుల పాటు జిల్లా విడిచి వెళ్లొద్దని ఆదేశించారు. ఈ గడువులోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలనను పరుగులు పెట్టించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. 99 రోజుల పాటు జిల్లాను విడిచి వెళ్లొద్దని సీఎం ఆదేశించారు. రాజధాని శివారు జిల్లాల కలెక్టర్లు.. సీఎస్ కె.రామకృష్ణారావు అనుమతి లేకుండా హైదరాబాద్ వస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో వేగం పెంచే లక్ష్యంతో ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక పేరుతో 99 డేస్ యాక్షన్ ప్లాన్ అమలు చేయబోతోందన్నారు. జిల్లాల్లో బాగా పని చేసిన కలెక్టర్లకు సీఎం గ్రేడింగ్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తాజా మీటింగ్‌లో పనితీరు ఆధారంగా కలెక్టర్లకు సీఎం గ్రేడింగ్ ఇవ్వనున్నారని ఆశించిన మేరకు పని తీరు చూపని కలెక్టర్లకు దిశానిర్దేశం చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో పలువురు మంత్రులు, సీఎస్, ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొన్నారు. ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికను నిర్వహిస్తుంది. అయిదు దశల్లో 99 రోజుల పాటు జరిగే కార్యక్రమానికి నోడల్ శాఖగా వ్యవహరిస్తున్న ప్రణాళిక శాఖ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభల నిర్వహణ ,ఏప్రిల్ 16న మండల స్థాయిలో , మే 2న నియోజకవర్గ స్థాయి , మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమాలు ఉంటాయని ఆ శాఖ వెల్లడించింది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుక నిర్వహించనున్నట్లు తెలిపింది. 10 వివిధ థీమ్‌లతో శాఖల వారీగా 99 రోజుల కార్యక్రమం ఉంటుందని వివరించింది. మొదటి థీమ్‌లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ , రెండవ థీమ్‌లో ఆరోగ్యం 3లో అరైవ్.. అలైవ్, 4లో సంక్షేమం , 5లో పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట, 6లో రైతు సంక్షేమం.. వ్యవసాయంపై కార్యక్రమాల నిర్వహణ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. 7లో విద్య, 8లో యువత.. క్రీడలు, 9లో మహిళలు , 10వ థీమ్‌లో పర్యావరణంపై సమావేశాలు జరుగుతాయని తెలిపారు. మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు , 99 రోజుల్లో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలుంటాయని వివరించింది. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను తయారు చేశామని వెల్లడించింది .

# భారత్ ప్రతిష్టకు భంగం



(మొదటిపేజీ తరువాయి)
హత్య చేసిన సంగతి తెలిసిందే. అమెరికా–ఇజ్రాయిల్–ఇరాన్‌ల మధ్య పెరుగుతున్న వైరుధ్యాలు సున్నితమైన ప్రాంతాన్ని తీవ్ర సంఘర్షణ వైపు నెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు కోటిమంది భారతీయులతో సహా కోట్లాది మంది ప్రజలు అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని అన్నారు. భద్రతాపరమైన ఆందోళనలు వాస్తవమే అయినప్పటికీ, సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే దాడులు సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తాయి. ఇరాన్‌పై ఏకపక్ష దాడులు, అలాగే ఇతర మధ్యప్రాచ్య దేశాలపై ఇరాన్ దాడులను ఖండించాలి. ఘర్షణలు మరింత ఘర్షణలకు దారితీస్తాయి. చర్చలు మరియు సంయమనం శాంతికి ఏకైక మార్గం అని అన్నారు. భారతదేశం నైతికంగా స్పష్టంగా ఉండాలి. అంతర్జాతీయ చట్టం మరియు మానవుల ప్రాణాలను కాపాడుకోవడంలో మనం స్పష్టంగా మాట్లాడే ధైర్యం కలిగి ఉండాలి. మన విదేశాంగ విధానం సార్వభౌమాధికారం మరియు వివాదాల శాంతియుత పరిష్కారాన్ని సూచిస్తుంది. అది స్థిరంగా ఉండాలని అన్నారు. మధ్యప్రాచ్యం సంఘర్షణపై ప్రధాని మోడీ మాట్లాడాలని పునరుద్ఘాటించారు. ప్రపంచ క్రమాన్ని నిర్వచించే మార్గంగా ఒక దేశాధినేత హత్యను సమర్థిస్తారా అని ప్రధాని మోడీని నిలదీశారు.

# ఖజానా నిల్... నేతల జేబులు ఫుల్



(మొదటిపేజీ తరువాయి)
తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలతో పాటు 420 హామీలను ప్రజలు నమ్మి అధికారం కట్టబెట్టారని తెలిపారు. ఖజానా ఖాళీ అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ఇటీవల ఓ సభలో కాంగ్రెస్ పార్టీకి అవసరమైతే రూ.1,000 కోట్లు ఇవ్వడానికి సిద్ధమని చెప్పారని గుర్తుచేశారు. దీన్ని బట్టి చూస్తే.. 'రాష్ట్ర ఖజానా నిల్.. పార్టీ నాయకుల జేబులు ఫుల్'గా ఉన్నాయని వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి తెలంగాణ అభివృద్ధికి దాదాపు రూ.12 లక్షల కోట్లు మేర నిధులు కేటాయించిందని కేంద్రమంత్రి వివరించారు. ఇందులో పన్నుల వాటా రూ.2.5 లక్షల కోట్లు, రహదారులు రూ.1.85 లక్షల కోట్లు, రైల్వే బడ్జెట్ కేటాయింపులు రూ.36000 కోట్లకు పైగా, రైల్వే పనులకు మరో రూ.50,000 కోట్లు, ఉపాధి హామీ రూ.40,000 కోట్లు, విద్యుత్ ప్రాజెక్టులు రూ.12,000 కోట్లు, పీఎం కిసాన్ నిధులు రూ.14,000 కోట్లు, ఉచిత రేషన్ రూ.50,000 కోట్లు, ఎరువుల సబ్సిడీ కోసం రూ.80,000 కోట్లు, విద్య.. క్రీడలకు రూ.21,000 కోట్లు, ఆరోగ్య సంరక్షణకు రూ.9,000 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కేందప్రభుత్వం గత 12 సంవత్సరాల కాలంలో రైతుల నుంచి వరి సేకరణకు రూ.2.6 లక్షల కోట్లు, పత్తి సేకరణకు రూ.60,000 కోట్ల కనీస మద్దుత ధర చెల్లించినట్లు తెలిపారు. కేంద్ర ఆర్థిక సంస్థల ద్వారా రూ.10 లక్షల కోట్ల ఋణాలు అందించారని చెప్పారు. 'స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ పథకం కింద వడ్డీ రహిత ఋణాలుగా రూ.10,000 కోట్లు పైగా ఇచ్చి మూలధన ప్రాజెక్టులకు సహకరించారని కేంద్రమంత్రి వివరించారు. ఈ నిధులతో మురుగునీటి నాళాలు, రోడ్లు, రైల్వేలు, బ్రిడ్జిలు, ఆసుపత్రులు, మెడికల్- నర్సింగ్ కాలేజీలు, పాఠశాలలు, హాస్టళ్లు, పర్యాటక ప్రాంతాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఓఆర్ఆర్ - ఆర్ఆర్ఆర్ మధ్య రేడియల్ రోడ్ల నిర్మాణం, గోదావరి - మూసీ నది అనుసంధానం, మూసీ నది సుందరీకరణ, స్మార్ట్ సిటీ మిషన్‌లో రాష్ట్ర వాటా నిధులు, వరదల వలన పాడైపోయిన నిర్మాణాల పునరుద్ధరణ, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనలో రాష్ట్ర వాటా నిధులు వంటి అనేక ప్రాజెక్టులకు సాస్కి నిధులను ఖర్చు చేశారు. ముఖ్యంగా ఎంఎంటీఎస్ ఫేజ్ - ఎఎ కోసం రూ.200 కోట్లు, మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వేలైన్ కోసం రూ.114 కోట్లు, స్మార్ట్ సిటీస్ పథకం కోసం రూ.315 కోట్లు, పీఎం గ్రామ సడక్ యోజన కోసం రూ. 674 కోట్లు, ఓఆర్ఆర్ - ఆర్ఆర్ఆర్ మధ్య రేడియల్ రోడ్ల నిర్మాణం కోసం రూ.200 కోట్లు, సిద్ధిపేట బైపాస్ రోడ్డు కోసం రూ. 110 కోట్లు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల కోసం రూ. 388 కోట్లు, పలు హాస్టళ్ల నిర్మాణం కోసం రూ.300 కోట్లు వంటి ప్రాజెక్టులు ఉన్నాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం.. జీతాలు, సంక్షేమ పథకాలు, రైతు భరోసా వంటి వాటికి కూడా ఋణాలపై ఆధారపడుతోందని కేంద్రమంత్రి తెలిపారు. రాష్ట్ర తలసరి అప్పు పెరుగుతోందన్నారు. 2014 లో మిగులు నిధులతో ఏర్పడిన రాష్ట్రానికి గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో, గత 27 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు పట్టిన దుస్థితికి నేటి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అద్దం పడుతోందని విమర్శించారు. మార్చి 16 నుంచి ప్రారంభమయ్యే రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ముందుగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పూర్తిస్థాయి శ్వేతపత్రం విడుదల చేయాలని లేఖలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# అనుభవమే భవిష్యత్తుకు పునాది



(మొదటిపేజీ తరువాయి)
పలు జిల్లాల కలెక్టర్లు మంగళవారం సచివాలయంలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాల పాలన, సంక్షేమ పథకాల అమలుపై మంత్రి వారికి కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. మంత్రిని కలిసిన వారిలో జోగులాంబ గద్వాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలి. ఐఏఎస్ అధికారుల కెరీర్‌లో జిల్లా కలెక్టర్లుగా పనిచేయడమే అత్యంత కీలకమైన అవకాశం. ఈ సమయంలో ప్రజలతో నేరుగా మమేకమైతే క్షేత్రస్థాయి సమస్యలపై పూర్తి అవగాహన వస్తుంది. ఈ అనుభవమే భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లలో పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని మంత్రి గుర్తు చేశారు. ఈ పథకాలను అర్హులైన ప్రతి పేదవాడికి చేర్చవలసిన బృహత్తర బాధ్యత కలెక్టర్లదేనని ఆయన స్పష్టం చేశారు. సంక్షేమం , అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ జిల్లాను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రజాపాలనలో 'ప్రజలే కేంద్రంగా' పాలన సాగాలని మంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను అర్థం చేసుకుంటూనే, స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేయాలి. అధికార యంత్రాంగం అంతా ఒక టీమ్‌లా కలిసి పనిచేసి, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని ఆయన చెప్పారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండి, క్షేత్రస్థాయిలో అన్ని అంశాలపై పట్టు సాధించాలని ఆయన అధికారులకు సూచించారు.

## ఖమేనీ హత్యపై మౌనమేలా?



(మొదటిపేజీ తరువాయి)
చేసినట్లు అమెరికా మరియు ఇజ్రాయిల్ ధృవీకరించింది. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న చర్చల సమయంలో దేశాధినేతను హత్య చేయడం సమకాలీన అంతర్జాతీయ సంబంధాల్లో తీవ్ర చీలికను సూచిస్తుందని అన్నారు. అయితే, ఈ ఘటన షాక్‌కు మించి, భారత ప్రభుత్వ మౌనం కూడా అంతే దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. భారత ప్రభుత్వం హత్యను లేదా ఇరాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడాన్ని ఖండించడం మానుకుందని ఆమె పేర్కొన్నారు.

## రాజ్యసభ రేసులో 4గురు బిసి నేతలు

(మొదటిపేజీ తరువాయి)
అవకాశాలు ఇచ్చిందని విమర్శించారు. తెలంగాణ కోసం పనిచేసిన వారిలో ఒక్కరికైనా బీఆర్ఎస్ రాజ్యసభ ఛాన్స్ ఇచ్చిందా? అని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. మార్చి నెలలో కొన్ని కార్పొరేషన్ పదవులు ఇస్తామని, ప్రస్తుతం వాటిపై కసరత్తు జరుగుతోందని మహేష్ గౌడ్ తెలిపారు. పినరయి విజయన్ వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమాధానం ఇచ్చారని చెప్పారు. రాజకీయాల కోసమే విజయ్ మాట్లాడుతున్నారని, కేరళంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన వెల్లడించారు. నమ్ముకున్న సిద్దాంతం కోసం మావోయిస్టులు దశాబ్దాలుగా పనిచేశారని టీపీసీసీ చీఫ్ చెప్పుకొచ్చారు. ఆపరేషన్ కగార్‌ను తాము వ్యతిరేకించామని తెలిపారు. పాకిస్థాన్‌తో చర్చలకు ఒప్పుకున్న మోదీ మావోయిస్టులతో చర్చలకు ఒప్పుకోలేదని విమర్శించారు. వారి సిద్ధాంతంతో తమకు భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ప్రజల కోసం పోరాడిన వారిపై గౌరవం ఉంటుందని చెప్పారు. తామైనా, మావోయిస్టులయినా పేద ప్రజల కోసమే పోరాటం చేశామని.. లొంగిపోయిన మావోయిస్టులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే ఆహ్వానిస్తామని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## డిమాండ్‌కు తగ్గట్లుగా విద్యుత్ ప్రణాళిక



(మొదటిపేజీ తరువాయి)
డిమాండ్ ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. కోతలు లేకుండా.. ఎటువంటి అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యుత్ సంస్థలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. పెద్ద రాష్ట్రాలతో సమానంగా తెలంగాణ రికార్డు సృష్టించిందని వివరించారు. ఉదయం 8.00 గంటలకే నింగిలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మధ్యాహ్నానికి సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. దీంతో ఇళ్లలోనే ప్రజలు ఉండి పోతున్నారు. ఏసీలు, ఫ్రిజ్‌లు ఆన్ చేసి.. ఉంచుతున్నారు. దాంతో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది.

# వేంసూరులో రెచ్చిపోతున్న మట్టి మాఫియా..

**రాయుడుపాలెం గుట్టపై యధేచ్ఛగా మట్టి త్రవ్వకాలు.**

**ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టి తరలింపు.**

**ఇంత జరుగుతున్నా కన్నెత్తి చూడని రెవిన్యూ అధికారులు**

**సంబంధిత అధికారుల మౌనం పై సర్వత్రా విమర్శలు.**

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:**

తమ సొంత భూమిలో మట్టి తవ్వకాలు జరపాలన్నా సంబంధిత భూమి గల వ్యక్తులు ప్రభుత్వ అధికారుల అనుమతి తీసుకోవాలి అలాంటిది సత్తుపల్లి నియోజకవర్గంలో అక్రమార్కులు పట్టపగలే అక్రమంగా మట్టి తోలుకుంటూ కాసులు వెనకేసుకుంటున్నారు. ప్రభుత్వ సంబంధిత భూముల్లో గుట్టల్లో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా జెసిబిలు, టిప్పర్లు, ట్రాక్టర్ లతో పట్టపగలే మట్టి తోలుకుంటూ ప్రకృతి సహజ సిద్ధమైన సంపదను కొల్లగొడుతున్నారు. ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలోని రాయుడు పాలెం గుట్టపై యధేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి.ప్రభుత్వ అధికారుల అనుమతి లేకుండా ఎవరికి ఇవ్వాల్సిన ముడుపులు వాళ్ళకి ఇచ్చి మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి అని ప్రజలు చర్చించుకుంటున్నారు.



**అధికారుల మౌనం వెనుక అంతరార్థం!**

ఇంత బహిరంగంగా మట్టి మాఫియా మట్టి అక్రమ తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటుంటే పోలీసులు కానీ రెవిన్యూ అధికారులు కానీ అటువైపు కన్నెత్తి చూడటం లేదు.వేంసూరు మండల పరిధిలో మట్టి తవ్వకాలు జరిపి అక్రమార్కులు పట్టపగలే సొమ్ము చేసుకుంటున్నారు అనే విషయం రెవిన్యూ అధికారులకు తెలుసా? తెలియదా? లేక తెలిసే మౌనంగా ఉంటున్నారా? ముడుపులు భారీ స్థాయిలో పుచ్చుకుని అక్రమార్కుల ఆగడాలను చూసీచూడనట్లు ఉంటున్నారు అని గుసగుసలాడుకుంటున్నారు.

**సహజ వనరుల దోపిడీ**

ప్రకృతి సహజ సిద్ధమైన గుట్టలను మట్టి మాఫియా మింగేస్తుంటే ప్రభుత్వ యంత్రాంగం చోద్యం చూడడం ప్రజల్లో పలు అనుమానాలకు తావిస్తుంది. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని లేకపోతే మట్టి మాఫియా ఇలా పట్టపగలే మట్టి తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకోదని చర్చించుకుంటున్నారు.వర్షాలు అధికంగా పడి వరదలు వచ్చినప్పుడు పంట పొలాలు చేలకు అండగా ఉండే గుట్టలను మట్టి మాఫియా త్రవ్వుకుని సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమార్కులు కాసులకు కక్కుర్తిపడి ఎవరి ఇష్టం వచ్చినట్టు వాళ్ళు సహజ సిద్ధమైన సంపదను కొల్లగొడుతూ సొమ్ము చేసుకుంటుంటే ప్రభుత్వ యంత్రాంగం చోద్యం చూస్తూ కూర్చోవడం ఏమిటి అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా మట్టి మాఫియాను నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలని , ప్రకృతి సహజ సిద్ధమైన సంపదను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఫార్మాస్యూటికల్ పరిశోధనలో ఎం.అనూషకు పీహెచ్.డీ.

**పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి.**



ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థిని ఎం.అనూషను డాక్టరేట్ వరించింది. 'బయోలాజికల్ మ్యాట్రిక్స్ లో ఎంచుకున్న ఔషధాల అంచనా కోసం ఎల్సీ-ఎంఎస్/ఎంఎస్ పద్ధతుల అభివృద్ధి, ధ్రువీకరణ' అనే అంశంపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాంరెడ్డి గొడెల మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.అనూష పరిశోధన, మానవ ప్లాస్మాలో క్యాన్సర్ నిరోధక ఔషధాలైన అస్కిమినిబ్, ఫ్రక్విన్టినిబ్, లుర్బినెక్టెడిన్ లను లెక్కించడానికి సున్నితమైన ఎల్సీ-ఎంఎస్/ఎంఎస్ పద్ధతులను అభివృద్ధి చేసి ధృవీకరించినట్టు తెలియజేశారు. ధృవీకరించబడిన పద్ధతులు అద్భుతమైన ఖచ్చితత్వం, ఖచ్చితత్వంతో పాటు స్థిరత్వాన్ని చూపించాయన్నారు. అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండడంతో పాటు, ఫార్మకోకైనెటిక్, జీవ లభ్యత, క్లినికల్ అధ్యయనాలకు అనుకూలతను ప్రదర్శించాయని వివరించారు.అనూష సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఫార్మసీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.శివకుమార్, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రహదారుల మెరుగుకు కృషి

**నూతన సిసి రోడ్ పనులు ప్రారంభించిన గ్రామ సర్పంచ్ సరిత జగన్మోహన్ రెడ్డి**



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:**

కోడేరు మండల నాగులపల్లి గ్రామంలో ఎస్సి 7వ వార్డ్ కాలనీలో నూతన సిసి రోడ్డు పనులు ప్రారంభించిన గ్రామ సర్పంచ్ సరిత జగన్మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ సాయినీలా రామకృష్ణ , 2,వ వార్డ్ మెంబర్ శివకుమార్,7,వ వార్డ్ మెంబర్ కురువమ్మ వెంకట్రరాములు, గ్రామ పెద్దలు గోపాల ఆచారి, నారాయణ, మేస్త్రి వెంకటస్వామి, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## టూరిజం శాఖ డైరీ, క్యాలెండరు కలెక్టర్‌కు అందజేత

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ**

**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:**



సోమశిల – అలంపూర్ టూరిజం సర్క్యూట్ డెవలప్ మెంట్ పై చర్చ సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నాయక్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టూరిజం శాఖ డైరీ, క్యాలెండర్ ను జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ కలెక్టర్ బాదావత్ సంతోష్ నాయక్ కు అందించారు. అదే విధంగా సోమశిల – అలంపూర్ టూరిజం సర్క్యూట్ లో భాగంగా సోమశిల, సింగోటం, జట్ పోల్, కొల్లాపూర్ కోట తదితర ప్రాంతాలను టూరిజం పరంగా అభివృద్ధి చేసే ప్రణాళిక పై కలెక్టర్ బాదావత్ సంతోష్ నాయక్ తో చర్చించారు. త్వరలోనే టూరిజం శాఖ తరపున జిల్లా ఫారెస్ట్, రెవిన్యూ, దేవాదాయ శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి సోమశిల – అలంపూర్ టూరిజం సర్క్యూట్ పై సమీక్ష సమావేశం నిర్వహిద్దామని కలెక్టర్ బాదావత్ సంతోష్ నాయక్ తెలియజేసారు.

## ఆపండి.!బాల్య వివాహాల్ని...

**18 సం॥లలోపు బాలికలకు వివాహము చేయడం చట్టరీత్యానేరం**

**బాల్యవివాహాల జరగని గ్రామముగా తీర్చిదిద్దుతాం**

**ఇప్పలపల్లి సర్పంచ్ రాత్లావత్ గేమ నాయక్**



**అచ్చంపేట, అక్షిత ప్రతినిధి**


బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టడానికి సమాజంలోని ప్రతి వ్యక్తి బాధ్యత వహించాలని ఇప్పలపల్లి సర్పంచ్ రాత్లావత్ గేమ నాయక్ అన్నారు.నాగర్ కర్నూల్ జిల్లాలోని కోనేరు స్వచ్ఛంద సేవా సంస్థ, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సంస్థల ఆధ్వర్యంలో, లైన్ డిపార్ట్మెంట్ల సహకారంతో బాల్య వివాహ విముక్తి ప్రచార రథయాత్ర మంగళవారం

పదరా అమ్రాబాద్ మండల పరిధిలోని ఇప్పలపల్లి. మద్దిమడుగు. చిట్లకుంట .మాచారం.మరియూ ఉప్పునుంతల. మండల కేంద్రంలో తోపాటు వివిధ గ్రామాలలో

ఈ రథయాత్ర గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "జిల్లాలో ఇప్పటికీ బాల్యవివాహాలు జరుగుతున్నాయి. వీటిని నిర్మూలించడానికి అవగాహన కల్పించడం చాలా అవసరం. స్వచ్ఛంద సంస్థలు ఈ దిశగా చేస్తున్న ప్రయత్నాలు అభినం దనీయం. వంద రోజుల బాల్యవివాహ విముక్త క్యాంపెయిన్కు అందరూ సహకరించాలి" అని అన్నారు.

ఇప్పలపల్లి గ్రామంలో ఏ ఒక్క బాల్య వివాహ కాకుండా గ్రామపంచాయతీ ద్వారా గ్రామంలో బాల్య వివాహాలు జరగని రహితంగా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో . కోనేరు సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు. బాలల హక్కుల పరిరక్షణ వేదిక సామాజిక కార్యకర్త వెంకటేష్. ఇప్పలపల్లి గ్రామం ప్రజలు రామకృష్ణారెడ్డి సైదు రెడ్డి రామకృష్ణ పులిసిగ్గు హన్మా నాయక్ సేవా మరియు కోనేరు సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు. ఏరియా కోఆర్డినేటర్లు జాకీర్ హుస్సేన్ శ్రీనివాస్ యాదవ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## మండల వ్యాప్తంగా హోలీ వేడుకలు



**చేర్యాల అక్షిత ప్రతినిధి:**

హోలీ పండుగ సందర్భంగా మంగళవారం సిద్దిపేట జిల్లా చేర్యాల మున్సిపల్ పట్టణ మరియు మండల పరిధిలో ఆకునూరు దొమ్మట రాంపూర్ నాగపురి తదితర గ్రామాలలో హోలీ వేడుకలు ఘనంగా జరిగినాయి. మున్సిపల్ పట్టణంలో చైర్ పర్సన్, వైస్ చైర్మన్ మరియు కౌన్సిలర్లు, పార్టీలకతీతంగా నాయకులు ఒకరినొకరు రంగులు చల్లుతూ హోలీ వేడుకలు జరుపు కోగా, పట్టణ కిరణ వర్తక సంఘం సభ్యులు, తదితర నాయకులు స్థానిక సీఐ అపూర్వ రెడ్డిని కలిసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో ఉదయం నుంచే చిన్నారులు, యువకులు, పెద్దలు వీధిలోకి చేరి రంగుల కేలిని ప్రారంభించి ఒకరిపై ఒకరు రంగులు చాలుచుకుంటూ హోలీ హోలీ అని కేరింతలు పెడుతూ సందడి చేశారు. గ్రామాల్లోని నూతన సర్పంచ్, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు నూతన ఉత్సాహంతో హోలీ వేడుకలు జరుపుకున్నారు. ముఖ్యంగా యువత హోలీ పాటలతో డ్యాన్సులు చేస్తూ హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## కాశిబుగ్గ హోలీ వేడుకల్లో పాల్గొన్న బీసీ నాయకులు



**కాశిబుగ్గ , అక్షిత న్యూస్ :**

హోలీ పండుగను ప్రజలందరూ ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని ఉమ్మడి కాశిబుగ్గ బీసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు..

రసాయనిక (కెమికల్) రంగులను వినియోగించకుండా, పూలు, ఔషధ మొక్కలు, ప్రకృతి వనరులతో తయారైన సహజ రంగులను మాత్రమే ఉపయోగించాలని సూచించారు.

పర్యావరణానికి, మనుషులకు హాని కలిగించే రసాయనిక రంగులను అస్సలు వాడకూడదని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని, పండుగలను కూడా పర్యావరణహితంగా జరుపుకోవాలని సూచించారు.ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు పాటించాలని, హోలీని ప్రేమ, ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా మలుచుకోవాలని తెలిపారు. ఈ హోలీ వేడుకల్లో తెలంగాణ ఉద్యమ నాయకులు కొడారి రవి , తెలంగాణ ఉద్యమ నాయకులు రాం పెల్లి శ్రీనివాసా చారి, రౌత్ శ్రీనివాస్, జిల్లా బిజెపి ఓ బి సి సెల్ ఉపాధ్యక్షులు కోట సతీష్ , బిసి బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మపురి రామారావు, బిజెపి జిల్లా నాయకులు కందుకూరి శ్రీనివాస్, అరికాల రవి , డాక్టర్ హరీష్ , తౌటం బిక్షపతి ( బుచ్చి ) , వి ఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు ఎగ్గోజు రవీంద్ర చారి , రాం పెల్లి హిమాన్స్ , ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కొత్తపల్లి జోన్ అధ్యక్షులు ముత్తునూరి హరీష్‌కి మేయర్ పరామర్శ



**కరీంనగర్, అక్షిత బ్యూరో :**

కొత్తపల్లి జోన్ అధ్యక్షులు ముత్తునూరి హరీష్ ప్రమాదవశాత్తు కాలుకు గాయం కావడంతో కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ మంగళవారం హరీష్ ను పరామర్శించారు. ఈ సందర్భంగా మేయర్ ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకొని ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

స్థానికనాయకులు, కార్యకర్తలకు మేయర్ కోలగని శ్రీనివాస్ ఈ సందర్భంగా హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కేంచ శేఖర్, జిల్లా నాయకులు ఎర్రోళ్ల ప్రదీప్, ప్రధాన కార్యదర్శి కొప్పుల హరిప్రసాద్, గొపు మునీదర్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# 5 మంది ఆటో డ్రైవర్లకు జైలు శిక్ష

**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి :**

జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ టౌన్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించబడినవి. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో మద్యం మత్తులో వాహనాలు నడిపిన 6 మందిని పట్టుకొని, మంగళవారం సెకండ్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి ఆర్.శశిధర్ ఎదుట హాజరు పరచగా, విచారణ అనంతరం ఒక ద్విచక్ర వాహనదారునికి రూ.1000/- జరిమానా విధించగా, మద్యం సేవించి ప్రయాణికుల ఆటోలు నడిపిన 5 మంది డ్రైవర్లకు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించబడినది.

ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, "మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగి నిరపరాధుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. ముఖ్యంగా ప్రయాణికులను తీసుకెళ్తున్న ప్యాసింజర్ ఆటో డ్రైవర్లు మద్యం మత్తులో వాహనాలు నడపడం అత్యంత బాధ్యతారాహిత్యమైన చర్య. ఇటువంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు నిరంతరం కొనసాగుతాయి. ప్రజల భద్రతే మా ప్రధాన లక్ష్యం" అని తెలిపారు.



జిల్లా ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని పోలీసు శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

# ఆడపిల్లల్ని కాపాడుకుందాం

**సిడిపిఓ రేఖల మమత**

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**

ఐసిడిఎస్ మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని ఇస్లాంపుర జడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియంలో సిడిపిఓ రేఖల మమత ఆదేశాలతో బేటీ బచ్చావో బేటి పడావో (బీబిబిపీ) కార్యక్రమం నిర్వహించడం జరిగింది అందులో భాగంగా బాల్య వివాహలపై పిల్లలకు వ్యాసరచన పోటీ నిర్వహించారు పోటీలో ప్రతిభ కనబరిచిన బాలికలకు ప్రథమ, ద్వితీయ, బహుమతులు అందజేశారు కార్యక్రమంలో భాగంగా సూపర్వైజర్ నాగమణి మాట్లాడుతూ ఆడపిల్లలకు 18సంవత్సరాలు, మగపిల్లలకు 21వ సంవత్సరాల వయస్సు పూర్తయ్యేంత వరకు వివాహలు చేయరాదాని

అలా బాల్యవివాహాలకు పాల్పడిన వారు చట్టపర శిక్షలకు అర్హులవుతారని ఆడపిల్లల్ని కాపాడుకోవడం అందరి బాధ్యత, ఆడపిల్లలు చదువుకోవడానికి ప్రభుత్వం ఎన్నో సదుపాయాలు కల్పిస్తుంది ఆడపిల్లలకి ఎలాంటి ఆపద వచ్చినా అక్కున చేర్చుకోవడానికి బాలసదనాలు ఉన్నాయన్నారు. ఆడపిల్లలు వద్దనుకున్న వాళ్లు ప్రభుత్వ ఆసుపత్రులలో ఏర్పాటుచేసిన ఉయ్యాలలో వేయాలన్నారు. అంతేగాని అక్రమ దత్తత ఇవ్వకూడదని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్, 1098, 100 లకు కాల్ చేసి తెలియపరచాలని గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ఆడపిల్లల చదువు గురించి ఆడపిల్లల భద్రత గురించి అక్రమ దత్తత గురించి డ్రాప్ ఔట్ కాకుండా, అందరూ చదువుకోవాలని, బాల్య వివాహాలు చేసుకోకూడదని అందరూ చదువుకొనేల చూడాల్సిన బాధ్యత మనందరికీ ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ కె.నాగమణి, జడ్పిహెచ్ఎస్ ఉర్దూ మీడియం అదనపు ఇంచార్జి హెచ్ఎం.రాభియా, స్కూల్ స్టాఫ్ అంగన్వాడీ టీచర్స్ పి.కవిత ఎండీ.రషీదాబేగం స్కూల్ పిల్లలు పాల్గొన్నారు



# హోళీ సరదాతో కొత్త ఉత్తేజం ఉత్సాహం

**ఎమ్మెల్యే బిఎల్ఆర్‌తో హోళీ వేడుకలు**

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**

నిత్యం రకరకాల ఒత్తిడిలకు గురయ్యే దైనందిన జీవితంలో ఉత్సవాలు, పండుగలు అందరూ కలిసి మెలసి జరుపుకోవడం వల్ల నూతన ఉత్తేజం, ఉత్సాహం లభిస్తాయని యోగా క్లబ్ మిర్యాలగూడ నిర్వహకులు పయిడిమర్రి సురేష్, కోల సైదులు అన్నారు. యోగా క్లబ్ లోని సభ్యులతో సహజ సిద్ధమైన రంగులు చల్లుకొంటూ ఆనందంతో హోలీ పండుగను జరుపుకొన్నారు. చెడుకు ప్రతీకైనా హోలీకను దహనం చేయడం ద్వారా మంచిని తెలియజేసే కథలను గుర్తు చేసుకున్నారు. అనంతరం శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి రంగులు పూసి, హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గురువు కంచర్ల వెంకటేశ్వర్లు, సభ్యులు గుడిపాటి కోటయ్య, గుత్తికొండ సుదర్శన్ రెడ్డి, పంతులు, చక్కా రాజేందర్, గుంటూరు చంద్రశేఖర్, బీసీ నాయకులు మహేష్ గౌడ్, నాగభూషణం, అంజిరెడ్డి, శంకర్,అంబటి వీర నారాయణ, కండె ప్రభాకర్, అల్లంపల్లి శ్రీనివాస్, మిట్టపల్లి శ్రీనివాస్, రాంబాబు, సైదులు గౌడ్, మాధా నాగేశ్వరావు, శ్రీనివాస్, వెంకటయ్య, కర్నాటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.





www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
జాతీయ దినపత్రిక

## సంపాదకీయం...

జోడెడ్ల పెనుగాలటలో లేగ దూడకు కష్టమొచ్చినట్లుంది. యుద్ధ మేఘాలు ఇప్పట్లో చల్లారేలా లేవు. చిలికి చిలికి గాలివానలా యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఆయా దేశాలకు విస్తరిస్తూ రగులుకుంటుంది. పిల్లికి చెలగాటం..ఎలుకకు ప్రాణ సంకటం అన్నది సామెత. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయిల్ చెలగాటంతో భారత్ సహా అనేక ప్రపంచ దేశాలకు ప్రాణసంకటంగా మారనుంది. ప్రధానంగా ఇంధన రవాణా బంద్ అయితే తట్టుకోవడం కష్టమే. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులు మధ్యప్రాచ్యాన్ని ఉద్రిక్తతల్లోకి నెట్టాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం తర్వాత ఆందోళనలు తారాస్థాయికి చేరాయి. ఈ యుద్ధం కేవలం రెండు దేశాలకు మాత్రమే పరిమితం కాకుండా, గల్ఫ్ లోని యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఖతార్, బహ్రెయిన్ వంటి దేశాలకు కూడా విస్తరించింది. ఇరాన్ ఈ దేశాల్లోని అమెరికన్ స్థావరాలపై మిస్సైల్స్, డ్రోన్లలో దాడులకు తెగబడుతోంది. దుబాయ్, దోహా, అబుదాబీ వంటి సిటీలపై దాడులు చేస్తోంది. ఇకపోతే హార్ముజ్ జలసంధి మూసివేత, చమురు రవాణాకు ఇబ్బందులు ఏర్పడనున్నాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. ఇది భారత్‌తో పాటు ఇతర ఆసియా దేశాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. గల్ఫ్ నుంచి వచ్చే చమురు ఈ మార్గం ద్వారానే రావాల్సి ఉంటుంది. ప్రపంచంలోని రోజువారీ చమురు వినియోగంలో 20 శాతం ఈ హార్మూజ్ జలసంధి నుంచే ప్రయాణిస్తుంటుంది.ఈ మార్గం గుండా వచ్చే చమురు ఎగుమతుల్లో 82 శాతం ఆసియాకు వెళ్తున్నాయి. ఇందులో భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా వాటా ఏకంగా 67 శాతం ఉంది. భారత్ ముడి చమురులో 90 శాతం చమురును మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. ఇందులో 40 శాతం హార్మూజ్ జలసంధి నుంచే వస్తున్నాయి. ఇరాక్ పై అమెరికా ఇజ్రాయిల్ దళాలు దాడుల నేపథ్యంలో హార్ముజ్ జలసంధి ద్వారా ఇంధన సరఫరా అంతరాయం కలిగే అవకాశంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ మార్గంలో ఏ విధమైన సంక్షోభం తలెత్తినా భారతదేశ ఆర్థిక వ్యవస్థ, ఇంధన భద్రతపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భారతదేశం దిగుమతి చేసుకునే ముడి చమురులో 50 శాతానికి పైగా హార్ముజ్ జలసంధి ద్వారానే వస్తుంది. ఇది ముఖ్యంగా సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, ఖతార్ నుంచి సరఫరా

*జోడెడ్ల పెనుగాలటలో లేగ దూడకు కష్టమొచ్చినట్లుంది. యుద్ధ మేఘాలు ఇప్పట్లో చల్లారేలా లేవు. చిలికి చిలికి గాలివానలా యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఆయా దేశాలకు విస్తరిస్తూ రగులుకుంటుంది. పిల్లికి చెలగాటం..ఎలుకకు ప్రాణ సంకటం అన్నది సామెత. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయిల్ చెలగాటంతో భారత్ సహా అనేక ప్రపంచ దేశాలకు ప్రాణసంకటంగా మారనుంది. ప్రధానంగా ఇంధన రవాణా బంద్ అయితే తట్టుకోవడం కష్టమే. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులు మధ్యప్రాచ్యాన్ని ఉద్రిక్తతల్లోకి నెట్టాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం తర్వాత ఆందోళనలు తారాస్థాయికి చేరాయి. ఈ యుద్ధం కేవలం రెండు దేశాలకు మాత్రమే పరిమితం కాకుండా, గల్ఫ్ లోని యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఖతార్, బహ్రెయిన్ వంటి దేశాలకు కూడా విస్తరించింది. ఇరాన్ ఈ దేశాల్లోని అమెరికన్ స్థావరాలపై మిస్సైల్స్, డ్రోన్లలో దాడులకు తెగబడుతోంది. దుబాయ్, దోహా, అబుదాబీ వంటి సిటీలపై దాడులు చేస్తోంది. ఇకపోతే హార్ముజ్ జలసంధి మూసివేత, చమురు రవాణాకు ఇబ్బందులు ఏర్పడనున్నాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. ఇది భారత్‌తో పాటు ఇతర ఆసియా దేశాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. గల్ఫ్ నుంచి వచ్చే చమురు ఈ మార్గం ద్వారానే రావాల్సి ఉంటుంది. ప్రపంచంలోని రోజువారీ చమురు వినియోగంలో 20 శాతం ఈ హార్మూజ్ జలసంధి నుంచే ప్రయాణిస్తుంటుంది.ఈ మార్గం గుండా వచ్చే చమురు ఎగుమతుల్లో 82 శాతం ఆసియాకు వెళ్తున్నాయి. ఇందులో భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా వాటా ఏకంగా 67 శాతం ఉంది. భారత్ ముడి చమురులో 90 శాతం చమురును మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. ఇందులో 40 శాతం హార్మూజ్ జలసంధి నుంచే వస్తున్నాయి. ఇరాక్ పై అమెరికా ఇజ్రాయిల్ దళాలు దాడుల నేపథ్యంలో హార్ముజ్ జలసంధి ద్వారా ఇంధన సరఫరా అంతరాయం కలిగే అవకాశంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.*

# చమురు కష్టాలు !

## ఇంధన రవాణా బ్రేక్




అవుతోంది. అదనంగా, భారతదేశ ఎల్ఎన్జీ దిగుమతుల్లో దాదాపు 60 శాతం, అలాగే ఎల్‌పిజిలో పెద్ద భాగం కూడా ఇదే మార్గం ద్వారా రవాణా అవుతోంది. ప్రపంచ వాణిజ్యాన్ని పర్యవేక్షించే సంస్థ 'కెప్లర్' గణాంకాల ప్రకారం, ఫిబ్రవరి 24 నాటికి రోజుకు సుమారు 2.6 మిలియన్ బ్యారెల్ల చమురు హార్ముజ్ మార్గం ద్వారా భారతదేశానికి చేరింది. ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు 20 శాతం, ఎల్ఎన్జీ వాణిజ్యంలో 30 శాతానికి పైగా ఈ జలసంధి ద్వారానే జరుగుతున్నందున, ఇక్కడి సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అమెరికా దాడుల ముప్పు నేపథ్యంలో శుక్రవారం ప్రపంచ చమురు ధరలు బ్యారెల్‌కు 72.87 డాలర్లకు పెరిగాయి. ఒకే రోజులో 6 డాలర్ల పెరుగుదల నమోదైంది. బ్యారెల్‌కు రూ.10 పెరుగుదల చోటుచేసుకుంటే, భారతదేశం దిగుమతులపై సుమారు 140 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.1.27 లక్షల కోట్లు అదనంగా చెల్లించాల్సి వస్తుందని అంచనా. ఇప్పటికే దేశంలో ఇంధనం, వంటగ్యాస్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. హార్ముజ్ జలసంధిలో అంతరాయం ఏర్పడితే భారతదేశానికి గట్టి దెబ్బ అవుతుందని 'కెప్లర్' హెచ్చరించింది. దేశానికి అవసరమైన ముడి చమురులో దాదాపు 90 శాతం దిగుమతుల పైనే ఆధారపడుతున్న నేపథ్యంలో, సరఫరా భద్రత కీలకంగా మారింది. రష్యన్ చమురు దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కూడా ఇంధన భద్రతపై ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి చెప్పిన వివరాల ప్రకారం, ఏదైనా సంక్షోభం తలెత్తితే భారత్ వద్ద 74 రోజులకు సరిపడా చమురు నిల్వలు ఉన్నాయి. అయితే, మొత్తం పెట్రోలియం నిల్వల్ని 90 రోజులకు పెంచాలని కేంద్రం భావిస్తోంది. ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లోని భూగర్భంలోని గుహల్లో భద్రపరిచిన స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్స్ సుమారుగా 9.5 రోజులకు సరిపోతుంది. దీనికి తోడు చమురు మార్కెటింగ్ కంపెనీల వద్ద అందుబాటులో ఉన్న ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం సుమారుగా 67 రోజులకు సరిపడా ఉంది. ఒక బారెల్ ధర ఒక డాలర్ పెరిగితే భారత్ ఏడాదికి 1.4 బిలియన్ డాలర్లు అదనపు ఖర్చు భరించాల్సి వస్తుంది. దీనికి తోడు గ్యాస్ ధరలు కూడా పెరుగుతాయి. భారత్ తన అవసరాలకు అవసరమైన గ్యాస్‌లో 50 శాతం దిగుమతులపైనే ఆధారపడి ఉంది. ప్రస్తుతం, హార్ముజ్ జలసంధి మూతపడినా, రష్యన్ ఆయిల్ భారత్‌కు అందుబాటులో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీనితోడు వెనిజులా ఆయిల్ కూడా భారత్ కొనుగోలు చేస్తోంది. ఇప్పటికప్పుడు భారత్‌కు వచ్చే ఇబ్బందులు లేవు, కానీ దీర్ఘకాలం హార్ముజ్ జలసంధి మూతపడితే మాత్రం చమురు ధరలు పెరిగే అవకాశ ఉంది. అంటే అమెరికా హెచ్చిరికలు చూస్తే మరో మూడునాలుగు రోజులు యుద్ధం కొనసాగే ప్రమాదం ఉంది. ఇరాన్ అంతు చూస్తామని ట్రంప్ హెచ్చరికలు చేస్తున్నారు. కాబట్టి ఇప్పట్లో మంటలు చల్లారేలా లేవు. పైగా యుద్ధం విస్తరిస్తోంది. లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులకు దిగింది. హిజ్బుల్ లక్ష్యంగా చేస్తున్న దాడుల కారణంగా ఇది విస్తరించడమే తప్ప ఆగిపోతుందనుకోవడానికి లేదు. అందువల్ల భారత్ సంయమనంతో ముందుకు సాగాల్సి ఉంటుంది. శాంతి మార్గంతో ఆయా దేశాల మధ్య సయోధ్యకు అడుగులు వేయాల్సి ఉంది.

## పిఐఓకు కమిషన్ హెచ్చరిక

**సమాచార హక్కు చట్టం అమలులో నిర్లక్ష్యం**

**15 రోజుల్లో సమాచారం ఇస్తామని హామీ**

**మరోసారి పునరావృతం కాకూడదని కమిషన్ హెచ్చరిక**



**భద్రాద్రి కొత్తగూడెం ,అక్షిత బ్యూరో:**

సమాచార సరఫరాలో జాప్యం పై తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి దుమ్ముగూడెం మండల తహసీల్దార్ కార్యాలయ పౌర సమాచార అధికారిని హెచ్చరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండల తహసీల్దార్ కార్యాలయంలో జిల్లాకు చెందిన అంతర్జాతీయ మానవ హక్కులు , నేర నిరోధక సంస్థ రాష్ట్ర సమన్వయ కర్త గంగాధర కిశోర్ కుమార్ 2023 లో ఒక సమాచార దరఖాస్తు దాఖలు చేశాడు.దుమ్ముగూడెం మండలంలోని వివిధ రెవెన్యూ గ్రామాలకు సంబంధించి 2ఏ భూములు, ఆర్.ఎస్.ఆర్ వివరాలతో పాటు ప్రభుత్వ భూముల వివరాలు కావాలని దరఖాస్తులో కోరాడు. ఐతే పౌర సమాచార అధికారిగా ఉన్న నాయబ్ తహసీల్దార్ మణిధర్ ఈ దరఖాస్తును బుట్టదాఖలు చేసాడు. దీనిపై భద్రాచలం సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ కార్యాలయంలో మొదటి అప్పీలు చేసినప్పటికీ ఎలాంటి సమాచారం అందకపోవడంతో తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ముందు రెండవ అప్పీలు చేశాడు. ఈ కేసు విచారణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐ.డి.ఓ.సి లోని కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. రాష్ట్ర సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి కేసు విచారణ చేపట్టగా ప్రస్తుతం నాయబ్ తహసీల్దార్ భరణి బాబు సమాచార సరఫరా బాధ్యునిగా హాజరయ్యారు. కేసు విచారణకు ముందే పదిహేను రోజులలోగా సమాచారం అందిస్తానని వాగ్దానం చేసినట్లు దరఖాస్తుదారుని యొక్క అంగీకార పత్రాన్ని కమిషనర్ కు సమర్పించాడు. దరఖాస్తుదారుడు అంగీకరించడంతో కమిషనర్ ప్రస్తుత నాయబ్ తహసీల్దార్ పై ఎలాంటి జరిమాన విధించలేదు. ఈ కేసులో ఇటీవలే తీర్పు వెలువరించగా సమాచార సరఫరాలో జరిగిన జాప్యంపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోసారి ఇలాంటి సంఘటన పునరావృతం కాకూడదంటూ, సమాచార సరఫరాలో జరిగిన ఆలస్యం కారణంగా స"హ" చట్టంలోని సెక్షన్ 7 సబ్ సెక్షన్ 1 ప్రకారం ఉచితంగా సమాచారం అందించాలని పౌర సమాచార అధికారిని హెచ్చరించింది. కాగా సమాచార దరఖాస్తును బుట్టదాఖలు చేసిన నాయబ్ తహసీల్దార్ మణిధర్ ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం తహసీల్దార్ గా విధులు నిర్వహిస్తున్నాడు.

## మద్యం సేవించి పట్టుబడిన 16 మందికి రూ.1,63,000 జరిమానా..

**ఒక్కరికి మూడు రోజుల జైలు శిక్ష**

**సిద్దిపేట, జిల్లా అక్షిత ప్రతినిధి ;**



సిద్ధిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, తన సిబ్బందితో కలిసి గత కొన్ని రోజుల క్రితం సిద్ధిపేట పట్టణ పరిసర ప్రాంతాలలో వాహనాలు తనిఖీ చేయగా 17 మందికి మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా గుర్తించి ఈరోజు సిద్ధిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా విచారణ చేసి 16 మందికి రూ.1,63,000/- జరిమానా ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు అని తెలిపారు.. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ ప్రవీణ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని కట్టడి చేయడానికి, ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందన్నారు మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి ప్రమాదం మరియు రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులకు కూడా ప్రమాదం ఉంటుంది, నివారణ గురించి మాత్రమే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుంది, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్లో పట్టుబడిన వారిని కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ గారు విచారణ జరిపి 10 వేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. పదివేల రూపాయలు కట్టడం వల్ల మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రజల్లో వాహనదారుల్లో అవగాహన రావడం జరుగుతుందన్నారు, అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు నడిపినచో ఒక్కొక్కరికి 5000/- రూపాయల జరిమానా విధించడం జరుగుతుందన్నారు ఎచ్చరించారు.

## నాగారం మండల వ్యాప్తంగా రంగుల హోలీ సంబరాలు

**హోలిక దహనం వేడుకల్లో చెడుపై మంచికి సంకల్పం**

**రంగుల సందడితో కళకళలాడిన గ్రామాల వీధులు**

**శాంతి భద్రతల కోసం ఎస్సై ఎస్. చిరంజీవి ఆధ్వర్యంలో పర్యవేక్షణ**

**నాగారం అక్షిత న్యూస్ :**



మండల వ్యాప్తంగా నిర్వహించిన హోలీ సంబరాలు ఈసారి కేవలం సంప్రదాయ పండుగ పరిమితుల్లోనే కాకుండా సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచాయి. చెడుపై మంచికి సంకేతంగా జరుపుకునే హోలీ పండుగను ప్రతి గ్రామంలోనూ భక్తి, భరిత ఉత్సాహం, సాంస్కృతిక వైభవంతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే గ్రామ వీధులు రంగుల సందడితో కళకళలాడగా, చిన్నారుల నవ్వులు, యువత హర్షధ్వానాలు, పెద్దల ఆశీర్వాదాలతో పండుగ వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. ముందు రోజు సోమవారం సాయంత్రం జరిగిన హోలిక దహనం కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొని చెడు ఆలోచనలను దహనం చేసి మంచి సంకల్పాలతో కొత్త ఆరంభం చేయాలని సంకల్పించారు. ఈ సందర్భంగా సామాజిక విభేదాలు, వ్యక్తిగత కలహాలు అన్ని మరిచి పరస్పర ప్రేమాభిమానాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాల్లో యువజన సంఘాలు ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేసి జానపద నృత్యాలు, దేశభక్తి గీతాలు, సాంప్రదాయ వాద్య ప్రదర్శనలు నిర్వహించాయి. మహిళా సంఘాలు సహజరంగలతో హోలీ ఆడి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం విశేషం. రసాయనిక రంగుల వాడకం వల్ల కలిగే హానులను వివరించడంతోపాటు నీటి సంరక్షణ కోసం పలుచోట్ల డ్రై హోలీ నిర్వహించారు. పండుగ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు మండల ఎస్సై ఎస్. చిరంజీవి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రణ, మద్యం సేవించి అల్లర్లు సృష్టించరాదని హెచ్చరికలు జారీ చేయడంతో వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. గ్రామీణ ప్రాంతాల్లో హోలీ కేవలం రంగుల ఆటగానే కాకుండా సోదర భావాన్ని బలోపేతం చేసే సామాజిక వేదికగా నిలిచింది. రైతులు మంచి పంటల కోసం, యువత విద్య, ఉద్యోగాల్లో పురోగతి సాధించాలని దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొందరు దాతలు పేదలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి మానవతా విలువలను చాటారు. మొత్తంగా ఈసారి పోలీస్ సంబరాలు సంప్రదాయం, సాంస్కృతిక చైతన్యం, ఆధునిక అవగాహన కలగలిచిన విశిష్ట వేడుకలుగా నిలిచాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రంగుల సందడి మధ్య ఐక్యత, స్నేహం, శాంతి సందేశాలను విస్తరింపజేస్తూ మండల చరిత్రలో ఈ ఏడాది హోలీ ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచిందని ప్రజలు పేర్కొన్నారు. ఈ హోలీ పండుగ కార్యక్రమాలలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మహిళా సంఘాలు, యువత, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ సమతుల్యతకు వన్యప్రాణులు అవసరం

**జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్**

**జిల్లా కేంద్రం లో ఘనంగా ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం**

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:**





వాతావరణ సమతుల్యతకు వన్యప్రాణులు ఎంతో అవసరమని జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయ ఆవరణలో ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్ చంద్ సర్దార్ అధ్యక్షతన నిర్వహించిన ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణతో వాతావరణ సమతుల్యత సాధ్యమవుతుందని అన్నారు. అడవులు వన్యప్రాణుల రక్షణకు ప్రజలు తమతో కలిసి రావాలని కోరారు. అటవీశాఖ తరపున వన్యప్రాణుల సంరక్షణ కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం మాణిక్ గూడా అర్బన్ పార్క్ లో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.

### హోలీ వేడుకలు

జిల్లా అటవీ శాఖ కార్యాలయ ఆవరణలో హోలీ వేడుకలు జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డిఎఫ్ఒ కుటుంబ సభ్యులతో కలిసి, సిబ్బందితో నిర్వహించుకున్న వేడుకల్లో ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండగ ప్రతి కుటుంబంలో సంతోషాలు నింపాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు యోగేష్ కులకర్ణి, ఝాన్సీ రాణి, సెక్షన్ అధికారులు మహేందర్, సాయిచరణ్, సతీష్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

## యాదాద్రి ఆలయ ఈఓ భవానీ శంకర్‌ను అభినందించిన విశ్రాంత ఉద్యోగులు

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:**





యాదాద్రి లక్ష్మి నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించిన సత్తుపల్లి విశ్రాంత ఉద్యోగులు ఆలయ ఈఓ భవానీ శంకర్ ను కలసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. మంగళవారం యాదాద్రి వెళ్ళిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు అక్కడ దేవాలయ ఈఓ గా పనిచేస్తున్న సత్తుపల్లి ప్రాంతానికి చెందిన భవాని శంకర్ ను ఆలయ సందర్శన అనంతరం మర్యాదపూర్వకంగా కలిసారు. ఆలయ అభివృద్ధి, భక్తుల కొరకు ఏర్పాటు చేస్తున్న సదుపాయాలను గురించి తెలుసుకుని అభినందనలు తెలిపారు. సత్తుపల్లి ప్రాంతం నుండి ఐఏఎస్ అధికారిగా పదోన్నతి పొందిన తొలి వ్యక్తిగా భవానీ శంకర్ చేస్తున్న సేవలను ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకున్నారు. ఇటీవల ఉపాధ్యాయ ఉద్యోగ విరమణ చేసిన ఆదిశ్యామకృష్ణ, మధుసూదన రాజు దంపతులను ఆలయ ప్రాంగణంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షులు కేశవరెడ్డి,మోహన్ రెడ్డి, సోమిరెడ్డి.డి.కృష్ణయ్య,కృష్ణారెడ్డి,వెంకట్రామిరెడ్డి, కృష్ణారెడ్డి, మాధవరెడ్డి తదితరులు తమ కుటుంబ సభ్యులతో కలసి పాల్గొన్నారు.

## ఆల్ టైమ్ రికార్డు తిరగరాసిన భారత్, వెస్టిండీస్

# సూపర్-8 మ్యాచ్




**భారత్ - వెస్టిండీస్ సూపర్ 8 మ్యాచ్‌కు రికార్డు స్థాయి డిజిటల్ వ్యూయర్‌షిప్**

**2024 టీ20 వరల్డ్ కప్ ఫైనల్ రికార్డును బద్దలు కొట్టిన తాజా మ్యాచ్**

**ఐసీసీ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో 56 శాతం పెరిగిన వాచ్ టైమ్**

**జర్మనీ, ఇటలీ, జపాన్ వంటి దేశాల్లోనూ క్రికెట్‌కు పెరుగుతున్న ఆదరణ**

**న్యూఢిల్లీ:** ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ముఖ్యంగా భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య జరిగిన సూపర్ 8 మ్యాచ్ లైవ్ స్ట్రీమింగ్‌లో ఆల్ టైమ్ రికార్డులను తిరగరాసింది. గత 2024 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ సమయంలో నమోదైన అత్యధిక కాంకరెంట్ వ్యూస్ (ఒకేసారి చూసేవారి సంఖ్య) రికార్డును... ఈ ఇండియా-వెస్టిండీస్ మ్యాచ్ అధిగమించడం విశేషం.

ప్రస్తుతం జరుగుతున్న ఈ మెగా టోర్నీ డిజిటల్ ఎంగేజ్‌మెంట్‌లో మునుపెన్నడూ లేని విధంగా దూసుకుపోతోంది. ఐసీసీ.టీవీలో ఇప్పటికే 2024 పూర్తి టోర్నీ గణాంకాలను మించి వ్యూస్ నమోదయ్యాయి. గత టోర్నీతో ఇదే సమయానికి పోల్చి చూస్తే.. యూనిక్ యూజర్లు 28 శాతం పెరగ్గా, మొత్తం వాచ్ టైమ్ 56 శాతం వృద్ధి చెందింది. ఇక సోషల్ మీడియాలో ఐసీసీ వీడియో వ్యూస్ ఇప్పటికే 10 బిలియన్ల మార్కును దాటాయి. సగటున ఒక్కో యూజర్ మ్యాచ్ చూసే సమయం కూడా గతంలో 47 నిమిషాలు ఉండగా, ఇప్పుడు అది 58 నిమిషాలకు పెరిగింది.

ముఖ్యంగా ఇంగ్లీష్ యేతర భాషల ఫీడ్స్‌కు అద్భుతమైన స్పందన లభిస్తోంది. మొత్తం ప్లే-టైమ్‌లో సగం వాటా హిందీ, ఉర్దూ, నేపాలీ, జపనీస్ వంటి ఇతర భాషలదే కావడం గమనార్హం. ఇక క్రికెట్‌కు కొత్తగా పరిచయమవుతున్న దేశాల్లో (నాన్-ట్రెడిషనల్ మార్కెట్స్) ఆదరణ భారీగా పెరిగింది. జర్మనీలో 150 శాతం, ఇటలీలో 136 శాతం, జపాన్, దక్షిణ కొరియాల్లో 100 శాతానికి పైగా వ్యూయర్‌షిప్ పెరిగింది.

### టీమిండియా సెమీస్‌లో ఉన్నా..

## కెప్టెన్ రికార్డుపై ఆందోళన...

**ఇంగ్లండ్‌తో టీ20 ప్రపంచకప్ సెమీస్‌కు ముందు కెప్టెన్ సూర్యకుమార్ ఫామ్‌పై ఆందోళన**

**ప్రపంచకప్‌లలో పెద్ద జట్లపై సూర్యకు రెండే అర్ధశతకాలు ఉన్నాయని చెప్పిన ఆకాశ్ చోప్రా**




**న్యూఢిల్లీ:** 2026 టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా అద్భుత ప్రదర్శనతో ఆరోసారి సెమీఫైనల్‌కు చేరుకుంది. ఇంగ్లండ్‌తో జరగనున్న కీలక పోరుకు సిద్ధమవుతున్న తరుణంలో భారత మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ ఆకాశ్ చోప్రా జట్టుకు సంబంధించి ఒక తీవ్రమైన ఆందోళనను లేవనెత్తాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్రపంచకప్‌లలో, ముఖ్యంగా బలమైన జట్లపై బ్యాటింగ్ రికార్డు ఆందోళనకరంగా ఉందని విశ్లేషించాడు. ఇప్పటివరకు ఐదు ప్రపంచకప్‌లు ఆడిన సూర్య, పెద్ద జట్లపై కేవలం రెండు అర్ధశతకాలే నమోదు చేశాడని చోప్రా గుర్తుచేశాడు.

ప్రస్తుత టీ20 ప్రపంచకప్‌లో సూర్యకుమార్ 7 మ్యాచ్‌లలో 231 పరుగులు చేశాడు. టోర్నమెంట్‌లో అమెరికాపై 49 బంతుల్లో 84 పరుగులు చేసి జట్టును గెలిపించినప్పటికీ, ఆ తర్వాత ఒక్క అర్ధశతకం కూడా చేయలేకపోయాడు. అంతేకాకుండా అతని స్ట్రైక్ రేట్ కూడా గణనీయంగా తగ్గింది. ఈ నేపథ్యంలో ఆకాశ్ చోప్రా తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడుతూ సూర్య గణాంకాలను విశ్లేషించాడు.

"నేను సూర్యకుమార్ యాదవ్ ప్రపంచకప్ గణాంకాలను పరిశీలించాను. అతని ఓవరాల్ నంబర్లు అద్భుతంగా ఉన్నాయి. అమెరికా వంటి జట్లపై రెండు హాఫ్ సెంచరీలు చేశాడు. అందులో ఒకటి చాలా ముఖ్యమైన ఇన్నింగ్స్. కానీ, బలహీన జట్లను పక్కనపెడితే, బలమైన జట్లపై అతను ప్రపంచకప్‌లలో కేవలం రెండు అర్ధశతకాలే సాధించాడు" అని చోప్రా పేర్కొన్నాడు.

## సురక్షితంగా..
## ఇంటికి వచ్చేశా: పీవీ సింధు



**బెంగళూరు:** ఒలింపిక్ పతక విజేత, భారత స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు.. సురక్షితంగా తన ఇంటికి చేరుకున్నది. గల్ఫ్ ప్రాంతంలో ఎయిర్‌స్పేస్‌ను మూసివేయడంతో.. దుబాయ్ విమానాశ్రయంలో సింధు చిక్కుకున్న విషయం తెలిసిందే. బర్మింగ్‌హామ్‌లో జరగనున్న ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు వెళ్లిన సింధు.. ఇరాన్ దాడుల నేపథ్యంలో దుబాయ్‌లో చిక్కుకుపోయింది. అయితే బెంగుళూరులోని తన ఇంటికి సురక్షితంగా చేరుకున్నట్లు సింధు మంగళవారం తన ఎక్స్ అకౌంట్‌లో వెల్లడించింది.

గత కొన్ని రోజులు ఉత్కంఠంగా, అయోమయంగా సాగినట్లు ఆమె చెప్పింది. స్వంత ఇంటికి చేరుకోవడం సంతోషకరంగా ఉన్నట్లు పేర్కొన్నది. దుబాయ్ అధికారులు, ఎయిర్‌పోర్ట్ సిబ్బంది, ఇమ్మిగ్రేషన్ అధికారులకు ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది. కష్ట సమయాల్లో చాలా కేర్ తీసుకున్నట్లు ఆమె పేర్కొన్నది. ఇక రెస్ట్ తీసుకుని మళ్లీ ఉత్తేజాన్ని పొంది, తదుపరి అడుగులు వేయాల్సి ఉందని సింధు తన ట్వీట్‌లో తెలిపింది.




## బిజినెస్ Business

## ఏటీఎం రూల్స్ మార్చిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్...

**ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న హెచ్‌డీఎఫ్‌సీ కొత్త నిబంధనలు**

**ఉచిత ఏటీఎం లావాదేవీల పరిమితిలోకి యూపీఐ క్యాష్ విత్‌డ్రాయల్స్**

**నగరాల్లో 3, ఇతర ప్రాంతాల్లో 5 సార్లు ఉచిత లావాదేవీలకు ఛాన్స్**

**పరిమితి దాటితే ఇకపై సాధారణ ఛార్జీలు వర్తింపు**




**న్యూఢిల్లీ:** భారతదేశపు అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ తమ ఖాతాదారులకు కీలక సమాచారం అందించింది. ఏప్రిల్ 1 నుంచి ఏటీఎం నగదు ఉపసంహరణ నిబంధనల్లో మార్పులు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇకపై యూపీఐ ఆధారిత నగదు ఉపసంహరణలను కూడా నెలవారీ ఉచిత ఏటీఎం లావాదేవీల పరిమితిలో లెక్కించనున్నట్లు బ్యాంక్ స్పష్టం చేసింది. బ్యాంక్ జారీ చేసిన అధికారిక ప్రకటన ప్రకారం, ఏప్రిల్ 1 నుంచి ఈ కొత్త విధానం అమల్లోకి రానుంది. ఇప్పటివరకు డెబిట్ కార్డు అవసరం లేకుండా యూపీఐ యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డబ్బులు డ్రా చేసుకునే వెసులుబాటు ఉండేది. దీన్ని ఇకపై ప్రత్యేక కేటగిరీగా చూడరని, సాధారణ డెబిట్ కార్డు విత్‌డ్రాయల్స్‌తో కలిపే లెక్కించనున్నట్లు బ్యాంక్ తెలిపింది. అంటే కస్టమర్లు కార్డు ఉపయోగించి డబ్బు తీసినా, లేదా యూపీఐ ద్వారా తీసినా అవి నెలవారీ ఉచిత కోటా కిందకే వస్తాయి. ఒకవేళ నిర్ణీత పరిమితి దాటితే, సాధారణ ఏటీఎం ఛార్జీలు వర్తిస్తాయి.

ప్రస్తుతం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సేవింగ్స్, శాలరీ ఖాతాదారులకు తమ బ్యాంక్ ఏటీఎంలలో నెలకు 5 ఉచిత లావాదేవీలను అనుమతిస్తోంది. అలాగే ఇతర బ్యాంక్ ఏటీఎంలలో మెట్రో నగరాల్లో (టాప్-6 సిటీస్) 3 సార్లు, ఇతర ప్రాంతాల్లో 5 సార్లు ఉచితంగా డబ్బు డ్రా చేసుకోవచ్చు. ఇకపై యూపీఐ లావాదేవీలు కూడా ఈ లిమిట్ లోపే ఉండాలి. బ్యాంకింగ్ ఛానళ్లలో ఫీజుల విధానాన్ని ప్రామాణీకరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు బ్యాంక్ పేర్కొంది.

ఇక ఆర్థిక ఫలితాల విషయానికొస్తే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నికర లాభం 12.17 శాతం పెరిగింది. నికర వడ్డీ ఆదాయం కూడా 6.4 శాతం వృద్ధిని నమోదు చేసి రూ. 32,615 కోట్లకు చేరింది. నిన్న సోమవారం నాడు స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు రూ. 881.75 వద్ద స్థిరపడింది. హోలీ పండుగ సందర్భంగా మంగళవారం స్టాక్ మార్కెట్లకు సెలవు కావడంతో ట్రేడింగ్ జరగలేదు.

# నష్టమొచ్చినా తగ్గని పీఎఫ్ వడ్డీ..

**వరుసగా మూడో ఏడాది యథాతథం**

**2025-26 ఆర్థిక సంవత్సరానికి పీఎఫ్ వడ్డీ రేటు 8.25 శాతంగా ఖరారు**

**వరుసగా మూడో ఏడాది కూడా వడ్డీ రేటులో మార్పు చేయని ఈపీఎఫ్ఓ**

**ఈ నిర్ణయంతో 7.8 కోట్లకు పైగా చందాదారులకు లబ్ధి**

**నష్టాలను పూడ్చేందుకు గతేడాది మిగులు నిధుల వినియోగం**




**న్యూఢిల్లీ:** ఉద్యోగుల భవిష్య నిధి (పీఎఫ్) చందాదారులకు శుభవార్త. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను పీఎఫ్ డిపాజిట్లపై వడ్డీ రేటును 8.25 శాతంగా కొనసాగించాలని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) నిర్ణయించింది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అధ్యక్షతన జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ 239వ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. వడ్డీ రేటును యథాతథంగా కొనసాగించడం ఇది వరుసగా మూడో ఏడాది కావడం గమనార్హం. ఈ నిర్ణయం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 7.8 కోట్లకు పైగా పీఎఫ్ చందాదారులు స్థిరమైన రాబడిని పొందనున్నారు.

బోర్డు సిఫార్సు చేసిన ఈ వడ్డీ రేటు ప్రతిపాదనను ఇప్పుడు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదానికి పంపనున్నారు. ఆర్థిక శాఖ నుంచి ఆమోదం లభించిన తర్వాత ఈపీఎఫ్ఓ చందాదారుల ఖాతాల్లో వడ్డీని జమ చేస్తుంది. పీఎఫ్ ఖాతాల్లోని బ్యాలెన్స్‌పై నెలవారీగా వడ్డీని లెక్కించినప్పటికీ, ఏడాదికి ఒకసారి మాత్రమే ఖాతాలో జమ చేస్తారు. అయితే, 36 నెలలుగా ఎలాంటి కంట్రిబ్యూషన్ లేని క్రియారహిత (ఇన్‌యాక్టివ్) ఖాతాలకు వడ్డీ జమ కాదని ఈపీఎఫ్ఓ స్పష్టం చేసింది.

### మిగులు నిధులతో నష్టాల భర్తీ

పెట్టుబడులపై ఓ మోస్తరు రాబడులు వస్తున్న నేపథ్యంలో వడ్డీ రేటును 8.1 శాతానికి పరిమితం చేయాలని అంతర్గత కమిటీ సూచించినప్పటికీ బోర్డు మాత్రం 8.25 శాతం వైపే మొగ్గు చూపింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇతర ఆర్థిక సంస్థలతో పోలిస్తే ఇదే అత్యధిక వడ్డీ రేటు. ఈ నిర్ణయం వల్ల ఈపీఎఫ్ఓకు సుమారు రూ. 944 కోట్ల నష్టం వాటిల్లుతుందని అంచనా. అయితే, గతేడాది రూ. 5,480 కోట్ల భారీ మిగులు నిధులు ఉండటంతో ఆ నష్టాన్ని సులభంగా భర్తీ చేయనున్నారు. ఈ మిగులు నిధులతో మరో 2-3 ఏళ్ల పాటు ఇలాంటి చెల్లింపులు చేసే సామర్థ్యం ఈపీఎఫ్ఓకు ఉందని అధికారులు తెలిపారు.

### కీలక సంస్కరణలకు ఆమోదం

ఈ సమావేశంలో వడ్డీ రేటు నిర్ణయంతో పాటు పలు కీలక సంస్కరణలకు కూడా బోర్డు ఆమోదం తెలిపింది. ఆదాయపు పన్ను గుర్తింపు పొందిన ట్రస్టుల సమస్యల పరిష్కారానికి 'వన్-టైమ్ అమ్నెస్టీ స్కీమ్'ను ప్రకటించింది. దీని కింద జరిమానాలపై మినహాయింపులతో ఆరు నెలల గడువు ఇచ్చారు. దీనివల్ల 100కు పైగా వ్యాజ్యాలు పరిష్కారమవుతాయని అంచనా. అలాగే, ఈపీఎఫ్ మినహాయింపుల కోసం సరళీకృత విధానాన్ని (సాఫా) ప్రవేశపెట్టారు. దీని ద్వారా ప్రక్రియలను డిజిటలైజ్ చేసి, భారాన్ని తగ్గించనున్నారు. దీంతో పాటు సామాజిక భద్రతా కోడ్ 2020 కింద కొత్త పథకాలు, క్రియారహిత ఖాతాల్లో క్లెయిమ్‌లను ఆటోమేటిక్‌గా ప్రారంభించేందుకు ఒక పైలట్ ప్రాజెక్టును కూడా ప్రకటించారు.

## డేటా సెంటర్లపై దాడి వార్తలపై అమెజాన్ వివరణ

**యూఏఈలోని రెండు డేటా సెంటర్లపై డ్రోన్ దాడి జరిగిందని వెల్లడి**

**పశ్చిమాసియాలోని కొన్నిచోట్ల క్లౌడ్ సర్వీసులకు అంతరాయం**

**బహ్రెయిన్ లోని డేటా సెంటర్ సమీపంలో దాడులు**




**న్యూఢిల్లీ:** సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ మరణానికి ప్రతీకారంగా పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులు చేస్తోంది. ఆయా దేశాల్లోని అమెరికా స్థావరాలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతోంది. ఈ క్రమంలో యూఏఈలోని అమెజాన్ డేటా సెంటర్లపైనా దాడి జరిగిందని వార్తలు వెలువడ్డాయి. ఈ వార్తలపై తాజాగా అమెజాన్ వెబ్ సర్వీస్ స్పష్టతనిచ్చింది. యూఏఈలోని తమ డేటా సెంటర్లపై దాడులు నిజమేనని పేర్కొంది. రెండు డేటా సెంటర్లపై డ్రోన్లు దాడి చేశాయని, దీని ప్రభావంతో పశ్చిమాసియాలో పలుచోట్ల క్లౌడ్ సర్వీసులకు అంతరాయం కలిగిందని వివరించింది. సర్వీసుల పునరుద్ధరణకు తమ సిబ్బంది స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పింది. బహ్రెయిన్‌లోని డేటా సెంటర్ సమీపంలో జరిగిన దాడి వల్ల మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లినట్లు వెల్లడించింది. అయితే, ఉద్యోగులు ఎవరైనా గాయపడ్డారా లేదా అనే విషయంపై కంపెనీ స్పష్టత ఇవ్వలేదు.

www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY



## ఉద్యోగ సమయంలో దాచుకున్న సొమ్మును వెంటనే విడుదల చేయాలి

**పిఆర్పిఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు**



**ఖమ్మం/అక్షిత బ్యూరో :**

ప్రోగ్రెసివ్ రికగ్నైడ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రోటరీ నగర్ లో నివాసముంటున్న పెన్షనర్స్ కు పిఆర్పిఏ సభ్యత్వాన్ని ఇవ్వనైనది. అనంతరం జరిగిన పిఆర్పిఏ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వైవీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ( పెన్షనర్స్ కు) ఉద్యోగ సమయంలో దాచుకున్న డబ్బులను వెంటనే విడుదల చేసి వారికున్న సమస్యల నుండి విముక్తి పొందేలా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ పొంది 22 నెలలు గడుస్తున్నప్పటికీ గ్రాట్యువిటీ కమ్యుటేషన్ జిపిఎఫ్ జిఐఎస్ లీవ్ ఎన్ క్యాష్మెంట్ ఇవ్వకపోవడం వల్ల పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులతో తీవ్రంగా మనోవేదన చెందుతున్నారని వైవి తెలియజేశారు. పిఆర్సి ను వెంటనే ప్రకటించి బకాయిలో ఉన్న డిఎ లను విడుదల చేయాలని కోరారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపి పెన్షనర్స్ పడుతున్న ఆర్థిక బాధల నుంచి వెంటనే విముక్తి చెందేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి) సీతారామయ్య వి జగన్మోహన్రావు జి ఎస్ నారాయణ పి కొండలరావు కొత్త శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## భూదాన్ నిర్వాసితులను ఇండ్లలోకి పంపే వరకు పోరాటం చేస్తాం

**మంత్రులు తుమ్మల, శ్రీనివాస్ రెడ్డి, భట్టి పేదల పక్షమే అంటే మా పోరాటంలో భాగస్వామ్యం కావాలి**

**బీసీ ఎస్సీ ఎస్టీ రాష్ట్ర జేఏసీ చైర్మన్ విశారదాన్ మహరాజ్**

**ఖమ్మం/అక్షిత బ్యూరో :**



వెలుగుమట్ల భూదాన్ భూమిలో నిరాశ్రయులైన బాధితులను అంబేద్కర్ భవన్లో బీసీ ఎస్సీ ఎస్టీ రాష్ట్ర చైర్మన్ విశారదన్ మహారాజు పరామర్శించినారు.

వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఇండ్లు కూల్చబడిన ప్రదేశాన్ని సందర్శించి బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని మీరు ధైర్యం గా ఉండాలని అన్నారు. బాధితులందరూ సంఘటితంగా ఉండి అన్ని పార్టీలతో ఉమ్మడి కార్యాచరణ కమిటీని వేసి నిర్వాసితులకు వెలుగుమట్లలోనే ఇల్లు కట్టించే వరకు న్యాయపరమైన ప్రజాస్వామ్య పోరాటం కొనసాగిస్తామని పోరాట కమిటీని అన్ని పార్టీలతో ఏర్పాటుచేసి పేదలకు ఇండ్లు కట్టించి వారినీ ఇండ్లలోకి పంపించేంతవరకు వెనకడుగు వేసేది లేదని బీసీ ఎస్సీ ఎస్టి రాష్ట్ర చైర్మన్ విశారదన్ మహరాజ తెలియజేశారు. అగ్రవర్ణ ఆధిపత్యంలో బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలకు నిలవా నీడ లేకుండా చేసిన ప్రభుత్వం దోషిగా నిలబడిందని వెంటనే వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో పొడకంటి రాంబాబు ఖమ్మం జిల్లా కన్వీనర్ ములకలపల్లి సంగమేశ్వర రావు కో కన్వీనర్లు జక్కుల రాజేష్ కటకం వెంకటలక్ష్మి వీర్నారీ మహిళ జిల్లా అధ్యక్షులు పిఆర్ఆర్ దేవి ఆంటోనీ సురేష్ కొర్లపాటి వీర రాఘవులు నాగేశ్వరావు నర్ల శేషయ్య ముదిరాజ్ రావుల హనుమంతరావు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ కాసుల సురేష్



**మహేశ్వరం, అక్షిత ప్రతినిధి**

రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని సిరిగిరిపురశీ గ్రామంలో.. గ్రామ సర్పంచ్ దయ్యాల కృష్ణవేణి శీను మాట్లాడుతూ... జరుగుతున్న అటువంటి అభివృద్ధి పనులు చూసి ఓర్వ లేక, ఈర్ష్యతో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ వార్డు సభ్యుడి గా కూడా పోటీ చేసి రెండింటిలో చిత్తుగా ఓడిపోయిన ఇంకా బుద్ధి రాని మాజీ సర్పంచ్ కాసుల సురేష్, గ్రామ పంచాయతీ పాలకవర్గం అయిన సర్పంచ్ దయ్యాల కృష్ణవేణిశ్రీను వార్డు సభ్యులపై సత్య దూర పిర్యాదులు చేస్తూ, పాత ఫోటోలు, అట్టి పిర్యాదుల పత్రాలను సోషల్ మీడియాలో పోస్టులు పెట్టుకుంటూ పత్రికలలో వేయిస్తూ నిరాధారమైన ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్నాడు. మాజీ సర్పంచ్ కాసుల సురేష్ సర్పంచ్, వార్డు సభ్యుడిగా ఓడిపోయినప్పటికీ నుండి మతిస్థిమితం లేకుండా పిచ్చోడిలా ప్రవర్తిస్తున్నాడు. పనిగట్టుకొని గ్రామ, మండల పరిధిలో పిర్యాదులు చేసినప్పటికీ మండల అధికారులు అవి నిరాధారమైన ఆరోపణలు అని తేల్చడంతో చేసేది ఏమి లేక మరో సారి వెకిలి ప్రయత్నంగా మానసిక స్థితి బాగాలేక, పనిపాటలేకుండా ఓడిపోయిన అక్కసుతో ప్రజా తీర్పుకి గౌరవం ఇవ్వకుండా ఇంకా తానే సర్పంచ్ ను అని చెప్పుకు తిరుగుతూ సోషల్ మీడియాలో పోస్ట్ లు చేసుకుంటూ పిచ్చోడిలా వ్యవహరిస్తున్నారు. ప్రజావాణి లో నిరాధారమైన పిర్యాదు చేస్తూ అధికారుల విలువైన సమయాన్ని వృధా చేస్తూ, పాలక వర్గం పై బురద చల్లాలని, అభివృద్ధి కి ఆటకం కలిగించాలని చూస్తే ఊరుకునేది లేదని సిరిగిరిపురం గ్రామ ప్రజల తరుపున మరోసారి హెచ్చరిస్తూ. పత్రిక మిత్రుల ద్వారా ఈ క్రింది ఆరోపణలకు వాస్తవ సమాచారం తెలియజేస్తున్నాం.. 1 .పల్లె పకృతి వనం చెట్లు కొట్టివేశారు అని ఆరోపణ .గ్రామ పంచాయతీ భవనం పక్కన గల పల్లెప్రకృతి వనం ముందు కాలి స్థలం లో కొన్ని ఎండిపోయిన చెట్లని అన్ని అనుమతులు తీసుకొని తొలగించి గ్రామ యువత కోసం ఓపెన్ జిమ్ , వాకింగ్ ట్రాక్, వాలీ బాల్ కోర్టు షటిల్ కోర్టు పనులని ప్రారంభించటం జరింగింది, దానికి సంబంధించిన అట్టి మొక్కల ఫోటోలు అనుమతుల పత్రాలను పత్రిక మిత్రులకి అందజేస్తున్నాం. 2.గ్రామ పంచాయతీ పరిధి లో శ్మశాన వాటిక కబ్జా అంటూ ఆరోపణ. గ్రామము లో ఎంట్రీ పాయింట్, గ్రామ నీటి సరఫరా బోర్ల పరిసరాలు శ్మశానవాటిక కి వెళ్ళే దారిలో చేతవేయకుండా క్లీన్ చేయించడం జరిగింది.

3.రోడ్డు పై చెత్తా అంటూ చెత్త ఆరోపణ.లేని చెత్తను రోడ్డు పై వేయించి ఫోటోలు తీసుకుని వాటిని ఫోటో ఫ్రేమ్లు చేసుకొని పిర్యాదులు చేస్తూ పనిగట్టుకొని బద్నాం చేయాలని చూస్తూశీడడం.

4.వాటర్ ట్యాంకర్ ఆరోపణ. గ్రామ పంచాయతీ కి నాసిరకం మెటల్ వాడిన నీటి ట్యాంకర్ ను తను సర్పంచ్ గా ఉన్నప్పుడు తీసుకుని కొన్ని రోజులకు అది పాడైతే ట్యాంకర్ ను మరమ్మతులకు పశీపితే వాడటం లేదని నిరాధార ఆరోపణలు చేస్తూఉండటం. 5.గ్రామ పరిధిలో గల తను సర్పంచ్ ఉన్నపటి రోడ్డులను డ్రైనేజీ లను నాసిరకంగా వేయించి వాటిని మర్మతులు చేయక పొగ ఇప్పుడు మరమ్మతులు చేస్తుంటే ఓర్వలేక ఆరోపణలు 6.వడ్డేర నాయి బ్రాహ్మణుల శ్మశాన కబ్జా అనే ఆరోపణ. వడ్డెర బ్రాహ్మణ లకి సంబంధించిన శ్మశాన వాటికలకి అవి కబ్జా కి గురికాకుండా వారియొక్క అభ్యర్థన మేరకే చుట్టూ ప్రీకాస్ట్ కాంపౌండ్ వేయించటం , పరిసరాలు శుభ్రంగా చేయించటం జరిగింది. అని గ్రామ సర్పంచ్ దయ్యాల కృష్ణవేణి శీను తెలియజేశారు.

## విద్యుత్ కాంతులకు వీధి దీపాలు

**డివిజన్ 57 కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వీధి దీపాల ఏర్పాటు**

**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్ :**



మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 57 వ డివిజన్ పరిధిలోని పాల్సాబ్ గుట్ట, సుభాష్ నగర్, మిత్ర కాలనీ, థియేటర్ లైన్, రాజేంద్రనగర్ ప్రాంతాలలో గత కొంత కాలంగా వెలగని వీధి దీపాలను తొలగించి వాటి స్థానంలో అధునాతనమైన నూతన వీధి దీపాలను ఏర్పాటు చేశారు. వీధి లైట్ల ఏర్పాటు సంబంధించి మున్సిపాలిటీలో అందుబాటులో లేని మెటీరియల్ ను కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్ సొంతంగా ఆర్థిక సహకారం అందించి వీధి దీపాలను అమర్చారు. 57 డివిజన్ పరిధిలోని ప్రమాద పరిస్థితుల్లో ఉన్న స్తంభాలను, ఇనుప స్తంభాలను ఇప్పటికే కొన్ని తొలగించి కొత్తవి వేయించామని,ఇంకా మిగిలి ఉన్న వాటిని తమ దృష్టికి వచ్చిన వాటి స్థానంలో కొత్తగా సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ మేరకు విద్యుత్ ఉన్నతాధికారులతో చర్చించినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని సమస్యల్ని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు అనంత రెడ్డి, అఖిల సీతారామశాస్త్రి, లయన్ అశ్విని చంద్రశేఖర్ ఆడమ్స్,దశరథ్ నాయక్, కృష్ణయ్య రవికుమార్, శ్రీకాంత్ , రాజు , కేశవుల పర్యవేక్షణలో వీధి దీపాల ఏర్పాటు చేయడం జరిగింది.

# జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటిన హోలీ సంబరాలు

**వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ నితిక పంత్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:**

హోలీ పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రజలు మంగళవారం ఆనందోత్సవాల మధ్య ఘనంగా వేడుకలు జరుపుకున్నారు, సంబరాలు అంబరాన్నంటాయి. హోలీ వేడుకల్లో చిన్నా--పెద్ద తేడా లేకుండా ప్రజలు పరస్పరం రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, కాలనీలలో యువత సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకుని సందడి చేస్తూ వేడుకలను జరుపుకున్నారు. సహజ సిద్ధ రంగులతో పండుగను నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.





జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ నితిక పంత్ సిబ్బందితో కలిసి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. నృత్యం చేస్తూ సిబ్బందితో సంబరాల్లో పాల్గొన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ కుటుంబ సభ్యులతో పాటు సిబ్బందితో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మి తన నివాసం వద్ద వేడుకలు జరుపుకుని నియోజకవర్గ ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, కాగజ్నగర్లో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోలీ పండుగ సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర స్నేహాన్ని పెంపొందించే పండుగగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. హోలీ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## మూగ జీవానికి వైద్యం అందించిన విజయ్

**మానవత్వానికి నిదర్శనం లక్ష్మీకాంతారావు**

**సత్తుపల్లి , అక్షిత న్యూస్:**

మానవత్వానికి నిదర్శనంగా పద్మనాభుని లక్ష్మీకాంతారావు కాగా, మూగ జీవానికి వైద్యం అందించి ప్రాణాలు కాపాడిన విజయ్ కుమార్ ఆపద్బాంధవుడిగా సమాజంలో నిలువెత్తుగా నిదర్శనంగా నిలిచారు. వివరాలు ఇలా... కాకర్లపల్లి రోడ్లో గల పద్మనాభుని లక్ష్మీకాంతారావు కిరాణా షాపులో సోమవారం సాయంత్రం చిన్న వానరం పిల్ల కరెంట్ షాక్ గురై ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుచున్నది. గమనించిన కిరణా షాప్ యజమాని దానిని తన గదిలోకి తీసుకొచ్చి క్రింద మ్యాట్ వేసి, దానికి కొంచెం ఆహారం ఏర్పాటు చేశారు. తెల్లవారి గమనించిన కాంతారావు వానరం ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో వెంటనే వెటర్నరీ అసిస్టెంట్ చేపల విజయ్ కుమార్ కు ఫోన్ చేశారు. వెంటనే స్పందించిన విజయ్ వానరానికి వైద్యం అందించి ఆహారాన్ని అందించి ప్రాణాపాయ స్థితి నుండి కాపాడినారు.



## ఒక రూపాయి.. ఒక ప్రపంచం!

**కాయిన్ బాక్స్ మోగించిన అనుబంధాల గాథ**

**ఆ రోజులే బాగుండే**

**వలిగొండ అక్షిత న్యూస్:స్పెషల్ ఫీచర్**

గోడకు ఆనుకుని ఉండే పసుపు రంగు పెట్టె. పైభాగంలో "ఒక రూపాయి నాణెం వేయండి" అనే అక్షరాలు. పక్కనే వేలాడే నలుపు రంగు రిసీవర్ చేతిలో ఒక రూపాయి నాణెం ఉంటే చాలు... ప్రపంచం మరో చివర ఉన్న మనిషితో మనసును కలిపే వంతెన అదే కాయిన్ బాక్స్ టెలిఫోన్. ఇంటింటా ఫోన్ లేని రోజులు అవి. గ్రామాల్లో పోస్టాఫీసు, బస్టాండ్, లేదా చిన్న టీ హోటల్ పక్కన ఉండే ఆ యంత్రం చుట్టూ ఎప్పుడూ చిన్న క్యూలే. పరీక్ష ఫలితం చెప్పాలన్నా, ఉద్యోగం వచ్చిందని తెలియజేయాలన్నా, ఇంట్లో అనారోగ్యం విషయం అడగాలన్నా... కాయిన్ బాక్స్ ముందు నిలబడాల్సిందే. లైన్ కలిసే వరకు గుండె దడ. అవతలి వైపు "హలో" అన్న శబ్దం వినగానే కలిగే ఆ ఉపశమనం మాటల్లో చెప్పలేనిది. ఆ రోజుల్లో ఒక రూపాయి అంటే విలువ. ప్రతి నిమిషం అమూల్యం. ఎక్కువ సేపు మాట్లాడితే మరో నాణెం వేయాలి. అందుకే మాటలు కొలిచి చెప్పేవారు. "అమ్మ, బాగున్నారా... నేను సురక్షితంగా చేరుకున్నాను". ఈ కొద్దిపాటి మాటల్లోనే అపారమైన ప్రేమ, ఆప్యాయత దాగి ఉండేది. ఫోన్ కట్ అవుతుం దేమో అన్న భయంతో ప్రతి మాట హృదయాన్ని తాకేలా ఉండేది.

**ఎన్నో ప్రేమకథలకు సాక్ష్యాలు**

కాయిన్ బాక్స్ లు ఎన్నో ప్రేమకథలకు సాక్ష్యాలు. కాలేజ్ విద్యార్థులు సాయంత్రం సమయాల్లో క్యూలో నిలబడి మాట్లాడే ఆ క్షణాలు, సమయం ముగిసేలోపే "ఇంకో రూపాయి వేయ్" అన్న



స్నేహితుల ఆత్రుత... అవన్నీ ఆ తరం మధుర జ్ఞాపకాలు. ఒక్క కాల్ కోసం రోజంతా ఎదురుచూసే ఆ సహనం, ఆ ఆసక్తి అనుబంధాలను మరింత బలపరిచింది. ఇప్పుడు పరిస్థితి మారింది. ఇంటింటా స్మార్ట్ఫోన్లు. అపరిమిత కాల్స్, వీడియో చాట్స్, ప్రపంచం చేతిలోకి వచ్చేసింది. కానీ ఒక ప్రశ్న మాత్రం మిగిలింది. సౌకర్యం పెరిగిన కొద్దీ సంబంధాల విలువ తగ్గిందా? అప్పట్లో ఒక్క కాల్కు ఉన్న ప్రాధాన్యం ఇప్పుడు అపరిమిత కాల్స్ మధ్య కనిపించడం లేదు అనే భావన చాలామందిలో ఉంది. ఇప్పుడు పాత దుకాణాల మూలల్లో దుమ్ము పట్టి పడి ఉన్న కాయిన్ బాక్సు కేవలం యంత్రాలు కావు. అవి ఒక తరం అనుబం ధాల సాక్ష్యాలు, మ్యూజియంలలో, పాఠశాలల్లో వీటిని ఉంచి కొత్త తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉంది. మొబైల్ లేని కాలం ఎలా ఉండేదో చెప్పే జీవంత చరిత్ర అవి. నేటి తరం చేతిలో స్మార్ట్ఫోన్ ఉంది. కానీ ఆ కాలం చేతిలో ఒక రూపాయి నాణెం ఉండేది. అది చిన్నదైనా, దాని విలువ మాత్రం అపారమైనది. కాయిన్ బాక్స్ మోగించిన ప్రతి రింగ్ టోన్ ఇప్పటికీ మనసులో ఒక యుగాన్ని మళ్లీ వినిపిస్తూనే ఉంటుంది..

### ఘనంగా కనకదుర్గాదేవి

## ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు

**మందమర్రి రూరల్, అక్షిత న్యూస్:**

మందమర్రి ఏరియా ఆర్కే వన్ మైన్స్ రెస్క్యూ స్టేషన్ ఆవరణలోని శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో తృతీయ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. రెండు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో సాగిన ఈ కార్యక్రమాలు ఆధ్యాత్మిక కాంతితో మెరిసిపోయాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మందమర్రి ఏరియా జిఎం ఎన్. రాధాకృష్ణ, బెల్లంపల్లి ఏరియా జిఎం విజయ్ భాస్కర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేద పండితులు బ్రహ్మశ్రీ ముస్త్యాల సంతోష్ శర్మ (చండీ ఉపాసకులు) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం జ్యోతి ప్రజ్వలనం, సంకల్పం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం, రక్షాబంధనం, అఖండ దీప స్థాపన, అంకురారోపణ, నవగ్రహ వాస్తు క్షేత్రపాలక యోగినీ మాతృకా సర్వతోభద్రమండల పూజలు, జపానుష్టానాలు, అగ్ని స్థాపన వంటి శాస్త్రోక్త కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్థాపిత దేవతా మూలమంత్ర హవనం, రుద్ర సహిత చండీ హవనం, చతుర్వేద సేవలు, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు భక్తులను



ఆధ్యాత్మికానందంలో ముంచెత్తాయి. సోమవారం మండప నిత్యపూజలు, దేవతా హవనాలు, దుర్గాహోమం, రుద్రహోమం, శాంతిహోమం, బలిప్రదానం, పూర్ణాహుతి, మహాకుంభాభిషేకం, మహాదాశీర్వచనం నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో బెల్లంపల్లి రీజియన్ జి.ఎం రఘుకుమార్, రెస్క్యూ జి.ఎం శ్రీనివాస్ రెడ్డి, వివిధ గనుల విభాగాలకు చెందిన హెచ్.ఓ.డీలు, అధికారులు, సిబ్బంది, యూనియన్ నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఆధ్యాత్మిక వైభవంతో పాటు సామూహిక ఐక్యతకు ప్రతీకగా నిలిచాయి.

## పిల్లలు లేరనే బాధతో వ్యక్తి ఆత్మహత్య..



**నంగునూరు, అక్షిత ప్రతినిధి:**

రాజగోపాల్ పేట గ్రామానికి చెందిన ఆకుబత్తిని శ్రీనివాస తండ్రి లక్ష్మయ్య, పద్మశాలి, వయసు 49 సంవత్సరాలు, ప్రస్తుతం సిద్దిపేట లో ఉంటున్నాడు వివాహమై 27 సంవత్సరాలు అయినా కూడా పిల్లలు కాలేదనే బాధతో మద్యానికి బానిసై సోమవారం నాడు సిద్దిపేట నుండి రాజగోపాల్పేటకు వచ్చి మద్యం మత్తులో పిల్లలు లేరని మనస్థాపానికి గురై రాజగోపాల్పేట పెద్ద చెరువులో పడి ఆత్మహత్య చేసుకోన్నాడు. మంగళవారం నాడు గ్రామస్థులు చూసి అతని భార్య కు తెల్పాగా, అతని భార్య ఆకుబత్తిని కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రాజగోపాల్ పేట పోలీస్ స్టేషన్ దర్యాప్తు అధికారి రంగరెడ్డి హెచ్ సి తెలిపినారు.

## విశిష్ట మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ని వెంటనే అధికారులు సీజ్ చేయాలి



**మహేశ్వరం, అక్షిత ప్రతినిధి**

రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నియోజకవర్గ మహేశ్వరం మండల కేంద్రంలోని తుక్కుగూడ లో మహేశ్వరం నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు సమతా ప్రకాష్ మాట్లాడుతూ. రెండు రోజుల క్రితం తుక్కుగూడ జిహెచ్ఎంసి విశిష్ట మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా మరణించిన మీగడ సంతోష్ కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. గుండె నొప్పితో ఉన్న సంతోష్ ని డాక్టర్లు గుర్తించకుండా ఎటువంటి అత్యవసరమైన చికిత్స చేయకుండా వెంటిలేటర్ ఆక్సిజన్ అందించకుండా కాలయాపన చేసి చివరికి సంతోష్ మరణించడం జరిగిందని కేవలం విశిష్ట హాస్పిటల్ వైద్య సిబ్బందినిర్లక్ష్యం కారణంగానే సంతోష్ మరణించాడని వెంటనే సంబంధిత వైద్యాధికారులు ఆసుపత్రి పై చర్యలు తీసుకొని ఆసుపత్రి సీజ్ చేయాలని కోరడం జరిగింది హాస్పిటల్లో సరియైన ఆధునిక సదుపాయాలు లేకుండా అందుబాటులో కార్డియాలజీ డాక్టర్ లేకుండా ఒక పేషంట్ కి ఏం జరుగుతుందో సరియైన అవగాహన లేకుండా హాస్పిటల్ నడుపుతున్న విధానానికి హాస్పిటల్ పైతగిన చర్యలు తీసుకోవాల వలసిందిగా కోరుతున్నాంఅని కందుల సమతా ప్రకాష్ ముదిరాజ్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షులు తెలిపారు.

# నేనే అందరినీ ఏడిపిస్తా..



## నాలో మరో కోణాన్ని చూస్తారు: లయ

'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' ఎంటర్‌టైనర్ అయినా కథలో ఓ ఆసక్తికర మలుపుతో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉంటాయని అంటున్నారు లయ. శివాజీతో కలిసి ఆమె నటించిన చిత్రమిది. సుధీర్ శ్రీరామ్ దర్శకుడు. ఈటీవీ విన్‌తో కలిసి నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా లయ పంచుకున్న ఆసక్తికర విశేషాలివే..! "శివాజీగారితో కలిసి నటించి 20ఏళ్లు అవుతోంది. ఈ సినిమా గురించి అడగగానే ఫ్యామిలీ డ్రామా అనుకున్నాను. కానీ, ఓ ఎంటర్‌టైనర్. అన్ని వయసుల వారికి నచ్చుతుంది. ఇందులో ఓ ఆసక్తికర ట్విస్ట్‌తో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి. ఇప్పటి వరకు నన్ను నేను ఇలాంటి పాత్రలో చూసుకోలేదు. మంగపతిలాంటి పవర్‌ఫుల్ పాత్ర చేసిన హీరోను డామినేట్ చేసే పాత్ర నాది. నేను, శివాజీ కలిసి నటించిన సన్నివేశాలు చక్కటి వినోదాన్ని పంచుతాయి. ఓటీటీ నుంచి థియేటర్‌లో విడుదలవడం ఎంతో ఆనందంగా ఉంది" "సినిమా అంటే శివాజీకి ప్యాషన్. సినిమాను అన్ని రకాలుగా ప్రేమిస్తుంటారు. ఇక దర్శకుడు సుధీర్ శ్రీరామ్ స్టోరీ ఎంత బాగా రాసుకున్నాడో. అంత క్లారిటీగా తీర్చిదిద్దాడు. ఏ పాత్రకు ఎంత నటన కావాలో అంతా మా నుంచి రాబట్టాడు. మంచి ప్రతిభ గల దర్శకుడు. లయ అంటే ఎమోషనల్ పాత్రలే చేస్తుందనే గుర్తింపు ఉండేది. కానీ, ఈ సినిమాలో అందరినీ ఏడిపిస్తా. తన భర్త, ఫ్యామిలీ గురించి ఆలోచించే స్వార్థపరురాలి పాత్ర"

"అన్నిసార్లు ప్రధాన పాత్రలు వస్తాయనుకోలేం. కానీ కథ, నా పాత్ర నచ్చితే చిన్నపాత్రలైనా చేస్తాను. కథను మలుపు తిప్పే శక్తిమంతమైన క్యారెకర్స్ చేయాలని ఉంది. నేను చూడటానికి సాఫ్ట్‌గా ఉన్నా ఏదైనా చెప్పాలంటే బలంగా చెబుతా. 'వదల' అనే సినిమాలో జగపతిబాబుతో నటిస్తున్నాను. ఇందులో నాలో మరో కోణాన్ని చూస్తారు. ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. డిఫరెంట్ జోనర్‌లో ప్రయత్నిస్తున్నాను. శ్రీకాంత్‌తో కూడా ఓ సినిమా చేస్తున్నాను. నాగేశ్వరరెడ్డి దర్శకుడు" అని విశేషాలను లయ పంచుకున్నారు.

## పెద్ది సినిమా

# రన్‌టైమ్‌పై ఊహాగానాలు

### ఆ వార్తలను కొట్టి పారేసిన చిత్రబృందం

ప్రస్తుతం టాలీవుడ్‌లో భారీ నిడివి గల సినిమాల ట్రెండ్ నడుస్తోంది. కంటెంట్ బలంగా ఉంటే మూడు గంటలకు పైగా రన్ టైం ఉన్నా ప్రేక్షకులు ఆదరిస్తారని రీసెంట్‌గా 'పుష్ప 2' నిరూపించింది. ఈ క్రమంలోనే సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' సినిమా కూడా 3 గంటల కంటే ఎక్కువ నిడివితో ఉండబోతోందని సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. సినిమా రఫ్ కట్ ఏకంగా 4 గంటలకు పైగా వచ్చిందని, ఎడిటింగ్ తర్వాత కూడా అది 3 గంటల పైనే ఉంటుందని ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని చిత్ర వర్గాలు కొట్టిపారేశాయి. సినిమా నిడివి గురించి వస్తున్నవన్నీ ఊహాగానాలేనని, అభిమానులు వీటిని నమ్మాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. షూటింగ్ దశలో ఉన్న సినిమా రన్ టైం గురించి ఇప్పుడే మాట్లాడటం సరికాదని, దర్శకుడు బుచ్చిబాబు ఒక పక్కా ప్లానింగ్‌తో సినిమాను రూపొందిస్తున్నారని తెలిపారు. ఒక ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ



చిత్రం ఆడియన్స్‌కు బోర్ కొట్టకుండా సరైన నిడివితోనే వస్తుందని భరోసా ఇచ్చారు. వృద్ధి సినిమాస్ పతాకంపై అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై నేషనల్ లెవెల్‌లో భారీ అంచనాలు ఉన్నాయి. చరణ్ ఒక విభిన్నమైన లుక్‌లో కనిపిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది.

# అల్లూ వారింట పెళ్లి బాజాలు



ఘనంగా శిరీష్ ప్రీవెడ్డింగ్ రిసెప్షన్

అల్లూ వారింట పెళ్లి బాజాలు మోగుతున్నాయి. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సోదరుడు అల్లు శిరీష్ త్వరలో పెళ్లి పీటలెక్కబోతున్నారు. తన ప్రేయసి నయనికా రెడ్డితో ఈ నెల 6న శిరీష్ వివాహం ఘనంగా జరగనుంది. ఈ సందర్భంగా అల్లూ కుటుంబం హైదరాబాద్‌లోని అల్లూ స్టూడియోస్‌లో భారీ స్థాయిలో ప్రీ-వెడ్డింగ్ రిసెప్షన్‌ను నిర్వహించింది. ఈ వేడుకకు సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇండస్ట్రీ నుంచి నందమూరి బాలకృష్ణ, అక్కినేని నాగార్జున, రామ్ చరణ్, మోహన్ బాబు, నాని, నాగచైతన్య, గోపీచంద్, బ్రహ్మానందం, రాజేంద్ర ప్రసాద్ హాజరయ్యారు. దర్శకుల్లో కె. రాఘవేంద్రరావు, అట్లీ, వి.వి. వినాయక్ పాల్గొన్నారు. ప్రముఖ నిర్మాత అశ్వనీ దత్ కూడా ఈ వేడుకలో కనిపించారు. రాజకీయ వర్గాల నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి, ఏపీ ఉప సభాపతి రఘురాకృష్ణరాజు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. అయితే ఈ కార్యక్రమంలో మలయాళ నటుడు, దర్శకుడు బాసిల్ జోసెఫ్ పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. టొవినో థామస్ హీరోగా తెరకెక్కించిన సూపర్ హీరో చిత్రం మిన్నల్ మురళితో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన బాసిల్ జోసెఫ్ ఈ వేడుకలో కనిపించడంతో ఇండస్ట్రీ వర్గాల్లో చర్చలు మొదలయ్యాయి. ఇటీవల అల్లు అర్జున్ హీరోగా బాసిల్ జోసెఫ్ ఓ సూపర్ హీరో కథను తెరకెక్కించబోతున్నారన్న వార్తలు వినిపించిన విషయం తెలిసిందే. 'శక్తిమాన్' పేరుతో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ సిద్ధమవుతోందని ప్రచారం జరిగింది.

అయితే ఆ వార్తల్లో నిజం లేదని బాసిల్ గతంలో స్పష్టం చేశారు. అయినప్పటికీ శిరీష్ ప్రీ-వెడ్డింగ్ వేడుకలో బన్నీ స్వయంగా బాసిల్‌ను అందరికీ పరిచయం చేయడం మళ్లీ ఆ ప్రాజెక్ట్‌పై ఊహాగానాలకు తెరలేపింది. ఇండస్ట్రీ ఇన్‌సైడ్ టాక్ ప్రకారం, బన్నీ?బాసిల్ జోసెఫ్ కాంబినేషన్‌లో ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు మళ్లీ ప్రారంభమైనట్లు తెలుస్తోంది. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందన్న వార్తలు వినిపిస్తు న్నాయి. ప్రస్తుతం అల్లు అర్జున్ రెండు భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ఒకటి అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న సూపర్ హీరో పాన్ వరల్డ్ చిత్రం కాగా, మరొకటి లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్. ముఖ్యంగా అట్లీతో చేస్తున్న పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ షూటింగ్ శరవేగంగా సాగుతోంది.

## కేరళ స్టోరీ-2 నుంచి

# కేరళ తొలగించాలి

### చిత్రంపై హైకోర్టులో మరో వ్యాజ్యం




బాలీవుడ్ నుంచి వచ్చిన 'ది కేరళ స్టోరీ 2' సినిమా టైటిల్ వివాదం కేరళ హైకోర్టులో మరో మలుపు తిరిగింది. ఈ చిత్ర పేరు నుంచి 'కేరళ' అనే పదాలను తొలగించాలని కోరుతూ తాజాగా మరో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. కేరళ రాష్ట్రాన్ని ఉగ్రవాదానికి, మతమార్పిడులకు నిలయంగా చిత్రీకరిస్తూ రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చేలా ఈ సినిమా ఉందని పిటిషనర్లు ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై కోర్టు కూడా స్పందిస్తూ.. సినిమా విడుదలను వాయిదా వేయగా.. చిత్రబృందం డివిజన్ బెంచ్ నుంచి పర్మిషన్ తెచ్చుకుని విడుదల చేసింది. అయితే ఈ సినిమా విడుదలైన అనంతరం సినిమా టైటిల్‌ను మార్చాలంటూ ఒక రిటైర్డ్ సోషల్ సైన్స్ టీచర్, హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న ఒక మహిళా న్యాయవాది కలిసి పిటిషన్‌ను వేశారు. కేరళ పేరును టైటిల్‌లో వాడటం వల్ల ప్రపంచవ్యాప్తంగా కేరళీయులపై ప్రతికూల ప్రభావం పడుతుందని, ఇది కేవలం ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని చేసిన ప్రచారమని పిటిషన్‌లో తెలిపారు. మరోవైపు ఈ సినిమా విడుదలై మిశ్రమ స్పందనలను తెచ్చుకుంది. ప్రస్తుతం కేరళలోని కొన్ని ప్రాంతాల్లో ఈ సినిమా ప్రదర్శనను వ్యతిరేకిస్తూ నిరసనలు కూడా వ్యక్తమవుతున్నాయి.

## లావణ్య త్రిపారి..సతీలీలావతి

# విడుదల వాయిదా




మెగా కోడలు లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'సతీ లీలావతి' విడుదల వాయిదా పడింది. మలయాళ నటుడు దేవ్ మోహన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మిస్తున్న ఈ సినిమా ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకుంది. నరేష్, వీటీవీ గణేశ్, సప్తగిరి, మొట్టా రాజేంద్రన్, జాఫర్ సాదిక్, జోషి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. మొదటగా మార్చి 6న విడుదల చేయాలని నిర్ణయించారు. అయితే విడుదలకు సమీపిస్తున్న వేళ అనూహ్య పరిణామాలు చోటుచేసు కోవడంతో రిలీజ్‌ను వాయిదా వేయాల్సి వచ్చిందని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దుర్గాదేవి పిక్చర్స్ విడుదల చేసిన ప్రకటనలో, 'లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో రూపొందిన 'సతీ లీలావతి' చిత్రాన్ని మార్చి 6న విడుదల చేయాలని భావించాం. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల నిర్ణయించిన తేదీన విడుదల సాధ్యంకాలేదు. కొత్త విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తాం. ఎలాంటి రాజీ లేకుండా, ప్రేక్షకుల అంచనాలకు అనుగుణంగా చిత్రాన్ని సిద్ధం చేస్తున్నాం' అని పేర్కొన్నారు. కుటుంబ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని కథను మలిచినట్లు చిత్ర వర్గాలు చెబుతున్నాయి. గతంలో 'భీమిలి కబడ్డీ జట్టు', 'శివ మనసులో శ్రుతి', 'శంకర' వంటి చిత్రాలతో ఆకట్టుకున్న దర్శకుడు తాతినేని సత్య ఈసారి పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను అందించనున్నారని తెలుస్తోంది. ఇక లావణ్య త్రిపాఠి పెళ్లి తర్వాత విడుదలవుతున్న తొలి చిత్రం కావడంతో మెగా అభిమానుల్లో ఈ సినిమాపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఆమె కొత్త లుక్, పాత్రలోని వైవిధ్యం ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని యూనిట్ నమ్మకంగా చెబుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార కంటెంట్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై హైప్ పెరిగింది. వాయిదా వార్త అభిమానులను కొంత నిరాశకు గురి చేసినప్పటికీ, క్వాలిటీ కోసం తీసుకున్న నిర్ణయమని మేకర్స్ స్పష్టం చేయడంతో సినీ ప్రియులు కొత్త రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## 5న వృషకర్మ

# గ్లింప్స్ విడుదల

అక్కినేని నాగచైతన్య హీరోగా, మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'వృషకర్మ'. 'విరూపాక్ష' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత దర్శకుడు కార్తీక్ వర్మ దండు తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో దీనిపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ



సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ గ్లింప్స్‌ను విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సిద్ధమైంది. ఈ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌ను అత్యంత గ్రాండ్‌గా నిర్వహించేందుకు మేకర్స్ ఒక ఆసక్తికరమైన వేదికను ఎంచుకున్నారు. ఈ నెల 5న విడుదల కానున్న 'వృషకర్మ' గ్లింప్స్‌ను హైదరాబాద్‌లోని ప్రసాద్స్ పి సి ఎక్స్ స్క్రీన్‌పై ప్రదర్శించనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. కేవలం మీడియా ప్రతినిధులు మాత్రమే కాకుండా, పెద్ద సంఖ్యలో అక్కినేని అభిమానులు కూడా ఈ ఈవెంట్‌కు హాజరుకానున్నారు. భారీ స్కేల్‌తో, హై టెక్నికల్ వాల్యూస్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాకు 'కాంతార' ఫేమ్ అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు. సీనియర్ నిర్మాత బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

People's voice అక్షిత
AKSHITHA NATIONAL DAILY


## వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా హోలీ సంబరాలు

**వరంగల్, అక్షిత బ్యూరో;**



హోలీ పండుగను పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఉదయం హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. బ్యాండ్ వాయిద్యాల మధ్య పోలీస్ అధికారులు, సిబ్బంది కమిషనర్ క్యాంపు కార్యాలయానికి చేరుకుని ఉత్సాహభరిత వాతావరణంలో వేడుకలు ప్రారంభించారు.

ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను అధికారులు, సిబ్బంది, మహిళలు, చిన్నారులు,రంగులతో ముంచెత్తారు. అనంతరం పోలీస్ కమిషనర్‌తో పాటు అధికారులు, సిబ్బంది పరస్పరం ఒకరికి ఒకరు రంగులు జల్లుకుంటూ పోలీస్ కమిషనర్ దంపతులతో పాటు అధికారులు, సిబ్బంది తీన్మార్, నాగిన్ డాన్స్ స్టెప్పులతో నృత్యాలు చేస్తూ సాంప్రదాయ పద్ధతిలో ,ఆనందోత్సాహాల నడుమ హోలీ పండుగ వేడుకలను జరుపుకుంటూ అధికారులు, సిబ్బందికి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, హోలీ పండుగ సౌహార్దం, సోదరభావం మరియు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ శాంతి, సంతోషాలతో పండుగను జరుపుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డీసీపీ అంకిత్ కుమార్, ఏ.ఎస్పీ శుభం, ట్రైనీ ఐపిఎస్ మనీషా నెహ్రా, అదనపు డీసీపీ సురేష్ కుమార్, శ్రీనివాస్ తో పాటు ఏసీపీ లు ఇన్స్ స్పెక్టర్లు, ఆర్. ఐలు, ఆర్. ఎస్. ఐ లు ఇతర పోలీస్ సిబ్బంది పలువురు పోలీస్ పాల్గొన్నారు.

## తిరుమలగిరి మండల వ్యాప్తంగాహోలీ సంబరాలు



**తిరుమలగిరి , అక్షిత ప్రతినిది :**

హోలీ పర్వదినాన్ని సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పట్టణ మండల వ్యాప్తంగా ప్రజలు మంగళవారం ఆనందోత్సవాల మధ్య ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. సంబరాలు అంబరాన్నంటాయి. హోలీ వేడుకల్లో చిన్నా--పెద్ద తేడా లేకుండా ప్రజలు పరస్పరం రంగులు చల్లుకుంటూ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దారావతు జుమ్మిలాల్ నాయక్, నూతనంగా ఎన్నుకోబడిన ఐదవ వార్డు కౌన్సిలర్ తిరుమణి యాదగిరి మండల పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సహజ సిద్ధ రంగులతో పండుగను నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోలీ పండుగ సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర స్నేహాన్ని పెంపొందించే పండుగగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. హోలీ పండుగ సందర్భంగా మండల వ్యాప్తంగా శాంతి భద్రతల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి అని కోరుతూ రంగుల పండుగ హోలీ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాలు సంబరాలు నింపాలని కోరుకుంటూ పట్టణ ప్రజలకు హోలీ పండుగ తెలుపుతూ ఘనంగా జరుపుకున్నారు. హోలీ పండుగ సంబరాలలో మండల నాయకులు మాజీ ఎంపిటిసి దుప్పల్లి అబ్బాస్, సంత్ సేవలల్ మండల కమిటీ అధ్యక్షులు బానోతు రాములు నాయక్, మాజీ కౌన్సిలర్ గుగులోతు భాస్కర్, వెంకన్న నాయక్, కండియా, త్రిశూల్వీన యూట్యూబ్ ఛానల్ సింగర్ సురేందర్ నాయక్, రమేష్, స్వాతి స్టూడియో ఫ్లెక్సీ సెంటర్ శ్రీనివాస్ అల్లుడు, చరణ్ నాయక్, సంపత్, నరేందర్ సతీష్ తదితరులు కాలనీవాసులు అందరు కలిసి హోలీ సంబరాలు జరుపుకున్నారు.

## తిరుమలగిరి నాయకుల ఆధ్వర్యంలో పవిత్ర హోలీ వేడుకలు

**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:**



తిరుమలగిరి మండల కేంద్రం వెలిశాల గ్రామ పరిధిలో ఈ పవిత్ర హోలీ పండగ సందర్భంగా జీవితంలో శాంతి, సంతోషం, సౌభాగ్యాలను తీసుకురావాలని మండల నాయకులు లోడే సాయి గౌడ్, కుంభం సతీష్ గౌడ్, కోరుకుంటు ఎల్లప్పుడూ సంతోషంగా, సుఖంగా ఉండాలని, కలలు నెరవేరాలని కోరుకున్నారు.

ఈ కార్యక్రమంలో పద్మశాలి సంగం తిరుమలగిరి అధ్యక్షులు, చింతకింద మురళి, మూఢ వెంకన్న పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు, బుద్ధా లక్ష్మయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉప్పల ఉపేందర్, ముద్రబోయిన ఉప్పలయ్య 4వర్డ్ ఇంచార్జి తిరుమలగిరి మున్సిపాలిటీ, దరావాత్ సోమన్న, రావుల భిక్షం, రవ్వలడ్డు (మొరిగాలా వెంకన్న ) నాయకులు తదితరులు కలిసి హోలీ పండుగ ఘనంగా జరుపుకున్నారు.

## రంగుల మయంగా ఎమ్మెల్యే కార్యాలయం -- ఘనంగా హోలీ సంబరాలు

**ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆధ్వర్యంలో వేడుకలు**

**ప్రజాప్రతినిధులు, కార్యకర్తల ఉత్సాహం**



**నిర్మల్ అక్షిత బ్యూరో:**

ముధోల్ నియోజకవర్గంలో హోలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ముధోల్ శాసనసభ్యుడు పవార్ రామారావు పటేల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయం రంగుల మయంగా మారి పండుగ శోభను సంతరించుకుంది. ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై హోలీ సంబరాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా భైంసా మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తాత్రి పాల్గొని ప్రజలతో కలిసి రంగులు చల్లుకుంటూ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. కార్యకర్తలు, సర్పంచులు, కౌన్సిలర్లు ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు ప్రత్యేక శోభ తీసుకువచ్చారు.

అదేవిధంగా ముధోల్ మాజీ శాసనసభ్యుడు జి. విట్టల్ రెడ్డి తన నివాసంలో కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో కలిసి హోలీ వేడుకలు నిర్వహించారు. పరస్పరం రంగులు చల్లుకుంటూ స్నేహభావం, ఐక్యతకు ప్రతీకగా నిలిచే హోలీ పండుగను సురక్షితంగా, పరస్పర గౌరవంతో జరుపుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా చైర్మన్ తుమ్మల దత్తాత్రి హోలీ శుభాకాంక్షలు తెలియజేస్తూ సమాజంలో సౌభ్రాతృత్వం, ఆనందం, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే జి.విట్టల్ రెడ్డి కూడా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో పండుగను జరుపుకోవాలని కోరారు. మొత్తంగా ముధోల్ నియోజకవర్గంలో హోలీ పండుగ ఐక్యతా సందేశంతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా కొనసాగింది.

# ఇసుకాసురులపై పోలీస్ పంజా

**కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణాపై దాడులు**

**ఆరుగురు అరెస్ట్**

**క్రిష్ణ ఎస్సై ఎస్ఎం నవీద్**



**మక్తల్, అక్షిత ప్రతినిధి :**

జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై కట్టడి చర్యల్లో భాగంగా కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుడ్డేబల్లూర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం



అందడంతో టాస్క్ ఫోర్స్ సిబ్బంది మరియు కృష్ణ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ఒక టిప్పర్ మరియు 5 ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ ఘటనకు సంబంధించిన 6 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని అరెస్ట్ అయిన వ్యక్తులు:-1)పూజారి శివ,కర్ణాటక రాష్ట్రం, గుల్బర్గా2)గడ్డమీది రమేష్,గుడ్డేబల్లూరు,3)గొల్ల నరసింహులు,కృష్ణ,4)కోల్మి రాజు,5)పల్ల అంజప్ప,6) ఎం.రమేష్,గుడేబల్లూర్ వారి పై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని కృష్ణ ఎస్సై ఎస్.ఎం. నవీద్ తెలిపారు.జిల్లాలో అక్రమ ఇసుక రవాణా,నిల్వలు మరియు అమ్మకాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉన్న అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎస్.ఎం నవీద్ హెచ్చరించారు.

# ఇరాన్‌పై దాడులు సరికాదు

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**

ఇరాన్ పై ఇజ్రాయిల్, అమెరికా సామ్రాజ్యవాదులు దాడి చేసి ఇరాన్ అధ్యక్షుడు ఖమఇనేని హత్య చేయటాన్ని నిరసిస్తూ ఎన్ఎస్పి క్యాంపులోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద మంగళవారం సాయంత్రం కార్యక్రమం నిర్వహించారు.

ఇరానులో అణు ఆయుధాలు ఉన్నాయనే నెపంతో 550 పైగా ఇరాన్ ప్రజలను హత్య చేయటం ప్రపంచం ఖండించాలని కోరారు.

ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ ను కూడ ఇరాక్ లో ప్రమాదకర రసాయనక ఆయుధాలున్నాయని ఆరోపిస్తూ ఉరిశిక్ష విధించారు.

వెనిజులా అధ్యక్షుడు రాబర్ట్ మధురోను అతని సహచరిని కూడా అర్ధరాత్రి అధ్యక్ష భవనంపై దాడి చేసి కిడ్నాప్ చేసి అమెరికాలో నిర్బంధించటం అమెరికా దుర్మార్గానికి పరాకాష్ట అని అన్నారు. అమెరికా, ఇజ్రాయిల్, చేస్తున్న అధర్మయుద్ధం వల్ల ప్రపంచానికి మూడవ ప్రపంచ యుద్ధం వచ్చే అవకాశం ఉన్నదన్నారు.

ఇరాన్ లో ఉన్న చమురు నిల్వలను అక్రమంగా చోరీ చేయటానికి మాత్రమే అమెరికా ఇరాన్ పై దాడి చేస్తున్నదని




అభిప్రాయపడ్డారు.

భారత ప్రభుత్వం అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ పై చేస్తున్న అధర్మ యుద్ధాన్ని ఆపవలసిందిగా కోరాలని ప్రభుత్వాన్ని కోరారు.

దేశంలో ఉన్న ప్రజాస్వామ్యవాదులు అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న అధర్మ యుద్ధాన్ని ఆపవలసిందిగా కోరారు.

సమావేశంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ భీసం రామయ్య, యుటిఎఫ్ రిటైర్డ్ నాయకులు సత్యనారాయణ రావు, రమణారెడ్డి, డిటిఎఫ్ నాయకులు బిక్షమయ్య, సామాజిక కార్యకర్త కిరణ్మయి, ఉదయకుమారి. అమృతయ్య పాల్గొన్నారు

# అటు కోతులు.. ఇటు కుక్కలు

**బెంబేలెత్తుతున్న జనం**

**హడలెత్తిస్తున్న కుక్కలు**

**గుంపులు గుంపులుగా సంచారం**

**రక్తం రుచిమరిగి ప్రజలపై దాడులు**

**జంకుతున్న పిల్లలు..**

**భయాందోళనకు గురవుతున్న పెద్దలు**

**కుక్కల దాడులు పట్టించుకోని**

**గ్రామ కార్యదర్శి, పాలకవర్గం**




**రామన్నపేట అక్షిత ప్రతినిధి**

రామన్నపేట మండల పరిధి నీర్నెముల గ్రామంలో వీధి కుక్కలు, కోతలు బెడద పెరిగింది. రోడ్లపై కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. కుక్కల భయానికి చిన్నాపెద్ద తేడా లేకుండా అందరూ భయపడుతున్నారు. ప్రజలు రోడ్లపై కాలినడకన వెళ్లాలంటే భయపడుతున్నారు. గుంపులుగా కుక్కలు సంచరిస్తుండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని భయపడుతున్నారు. కుక్కల కట్టడికి అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఇటీవల దాడులు పెరిగాయి. పట్టణాలు, గ్రామాల శివారు ప్రాంతాల్లో కోళ్ల వ్యర్థాలు, కోళ్ల ఫారాల నిర్వాహకులు చనిపోయిన కోళ్లను పాడేస్తున్నారు. కుక్కలు వాటిని ఆహారంగా తీసుకొని రక్తం రుచిమరుగుతున్నాయి. గుంపులుగా సంచరిస్తూ కనిపిచ్చిన వారినల్లా కరుస్తున్నారు. ఎక్కువగా పిల్లలు వాటి బారినపడుతున్నారు. కాలనీలు, గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే అరుస్తూ దాడికి పాల్పడుతున్నాయి. గ్రామంలో ఉదయం, రాత్రి సమయంలో కాలినడకన వెళ్లే వాళ్లు కుక్కల కారణంగా భయంతో ముందుకు సాగుతున్నారు. గ్రామ పంచాయతీ కుక్కలకు కు.ని. ఆపరేషన్లు చేసి వాటిని నియంత్రించాల్సి ఉండగా, ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. పలుచోట్ల కుక్కల దాడిలో పలువురు గాయపడ్డారు. అధికారులు కుక్కల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో ఉదయం,రాత్రిపూట వాహనాలపై వెళ్తున్న వారిపైకి వస్తుండటంతో వాహనాలపై నుంచి పడి గాయపడుతున్నట్లు తెలిపారు. జంతు యాక్టు ఉన్నప్పటికీ ఇతర మార్గాలు అన్వేషించి కుక్కల బారి నుంచి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.

## వెలుగుమట్ల బుదాన్ బాధితులకు
# అండగా పువ్వాడ పౌండేషన్

**ఖమ్మం/అక్షిత బ్యూరో :**

ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో నివాసం కోల్పోయిన వారికి అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని కేటీఆర్ ఇచ్చిన హామీ మేరకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశాలతో పువ్వాడ పౌండేషన్ మరియు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భోజనం మరియు మంచినీళ్లు ఏర్పాటు చేస్తున్నారు.జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ తాత మధుసూదన్ బాధితులకు స్వయంగా భోజనం వడ్డించారు.వారు మాట్లాడుతూ పేదల ఇళ్ళు కూల్చివేసి కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయంగా రోడ్డున పడేసి తిరిగి మంత్రులు వారిని అపహాస్యం చేస్తున్నారని అన్నారు.బాధితులకు గూడు దొరికే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని వారికి న్యాయం జరిగే వరకు పోరాడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వ్యక్తిగత సహాయకులు రవికిరణ్ మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ మహిళా నాయకురాలు కొల్లు పద్మ ప్రచార కార్యదర్శి షకీనా మాధవి నాయకులు బోజెండ్ల రామ్మోహన్ ఆరెంపుల వీరభద్రం ఎర్రా అప్పారావు వీరేందర్ గౌడ్ వెంకట్ ఉస్మాన్ నారుమల్ల వెంకన్న తిరుమల్ సతీష్ ప్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామస్తులకు నీటి సౌకర్యాన్ని అందించిన సర్పంచ్ వినోద్ రాథోడ్



**మహేశ్వరం, అక్షిత ప్రతినిధి**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పడమటి తండా గ్రామ సర్పంచ్ వినోద్ రాథోడ్ మాట్లాడుతూ. గ్రామ అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్టుగా తెలియజేశారు. ఎన్నో రోజుల నుండి నీటి సమస్య ఉన్నప్పటికీ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే బోర్ వేయించి ప్రజలకు మంచినీరు అందించడం జరిగిందన్నారు గ్రామ అభివృద్ధిలో భాగంగా డ్రైనేజీ సమస్యలు వీధిలైట్ల సమస్యలు లేకుండా చూస్తున్నామని తెలియజేశారు.. గ్రామంలో బోరు వేయించి నీటి సౌకర్యాన్ని కల్పించినందుకు గ్రామ సర్పంచ్ వినోద్ రాథోడ్ కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమంలో సర్పంచ్ వినోద్ రాథోడ్, మాజీ సర్పంచ్ రాములు నాయక్, వార్డ్ మెంబెర్ శ్రీను , బాబులల్ , తిరుపతి, బుజ్జి, మరియు సూర్య , భాస్కర్, వెంకటయ్య, లక్ష్మణ్ , శంకర్, రూపుల , తదితరులు యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని గ్రామ సర్పంచ్ వినోద్ రాథోడ్ తెలియజేయడం జరిగింది.

## మతసామరస్యానికి ప్రతీక రంజాన్

**ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చిన సర్పంచ్**

**వేమూరి సత్యనారాయణ రమాదేవి**



**అక్షిత న్యూస్ మునగాల**

ముస్లింల పవిత్ర మాసం రంజాన్ పురస్కరించుకుని మండల పరిధిలో నరసింహపురం గ్రామ సర్పంచ్ వేమూరి సత్యనారాయణ శ్రీ రమాదేవిల పెళ్లిరోజు పురస్కరించుకొని ముస్లిం సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలు సాయంత్రం ప్రార్థనల సమయంలో గ్రామంలోని మసీదు వద్ద వారికి పండ్లు స్వీట్లు అందించి, అనంతరం సామూహికంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు

ఈ సందర్భంగా సర్పంచ్ వేమూరి మాట్లాడుతూరంజాన్ పవిత్ర మాసం పరస్పర ప్రేమ,ఐక్యత మరియు సహనానికి ప్రతీక అని పేర్కొన్నారుగ్రామంలో అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి ఉండటం గర్వకారణమని అన్నారుమత సామరస్యాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు

ఇఫ్తార్ విందులో ఖర్జూరాలు పండ్లు,శ్రీహలీమ్ పలావ్ వంటి వంటకాలను అందించారు ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు హాజరయ్యారుఅనంతరం ముస్లిం సోదరులు వారికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు

గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు సామాజిక ఐక్యతను మరింత బలపరుస్తాయని పలువురు గ్రామస్తులు అభిప్రాయపడ్డారుసర్పంచ్ చేపట్టిన ఈ చర్యకు ముస్లిం సోదరులు కృతజ్ఞతలు తెలిపారు

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికపై సమావేశం నిర్వహించిన సీఎం

**వరంగల్, అక్షిత బ్యూరో:**

సీఎం రేవంత్ రెడ్డిఆధ్వర్యంలో మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" అమలుపై హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, చిన్నా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు,






వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో అధికారులకు పలు కీలక సూచనలు చేసిన సీఎం, నిజమైన అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలనీ. గ్రామ సభల్లో సంక్షేమ పథకాల వారీగా ప్రభుత్వం చేకూరుస్తున్న లబ్ధిని ప్రజలకు వివరించాలనీ,ప్రజా ప్రభుత్వంలో అందిస్తున్న రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ లబ్ధి దారుల అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనీ,విద్యా వ్యవస్థలో ప్రజా ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలనీ.

ప్రభుత్వ ఆసుపత్రులను పటిష్టం చేసేందుకు సమీపంలోని మెడికల్ కాలేజీలకు అనుసంధానం చేయాలనీ,తద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందిచేలా చర్యలు తీసుకోవాలిలని.మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లుల చెల్లింపులు కచ్చితంగా అందేలా చర్యలు చేపట్టాలనీ

99 రోజుల ప్రోగ్రాం లో గ్రామ స్థాయి నుంచి జిల్లా వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలనీ సీఎం  స్పష్టం చేశారన్నారు.

## రంగుల కేళి హోళీ

**రైస్ మిల్లర్స్ ఆధ్వర్యంలో ఘనంగా హోలీ వేడుకలు**

**డ్యాన్సులతో అలరించిన కర్నాటి రమేష్, బండారు కుశలయ్య**



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**

హోలీ వేడుకలు పురస్కరించుకొని మంగళవారం మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలను రైస్ మిల్లర్స్ అందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. రంగురంగులను చల్లుకుని అంగరంగ వైభవంగా హోలీ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కర్నాటి రమేష్, డాక్టరు బండారు కుశలయ్యల ఆటపాటలతో డ్యాన్సులతో అలరించారు. హోలీ పండుగ సంబరాలలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్, మిర్యాలగూడ మిల్లర్స్ అధ్యక్షులు గౌరు శ్రీనివాస్,  ఉపాధ్యక్షులు గోళ్ళ రామ్ శేఖర్, సెక్రటరీ వెంకటరమణ చౌదరి బాబి, జాయింట్ సెక్రెటరీ పోలిశెట్టి ధనుంజయ, కోశాధికారి గందే  రాము,  రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రేపాల మధుసూదన్, మాజీ అధ్యక్షులు మంచుకొండ  వెంకటేశ్వర్లు, రేపాల అంతయ్య, రైస్ మిల్లర్స్ హోలీ వేడుకలలో పాల్గొన్నారు.

## దమ్మయాత్ర భిక్షువులచే బుద్ధవనశీలో ప్రత్యేక ప్రార్థనలు

**నాగార్జున కొండను సందర్శించిన బౌద్ధ భిక్షువులు**





**నాగార్జునసాగర్, అక్షిత ప్రతినిధి :**

దమ్మ పాదయాత్ర బౌద్ధ భిక్షువులు బుద్ధ వనములోని ధ్యాన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు పూజలు నిర్వహించారు. కర్ణాటక గుల్బర్గా బుద్ధ విహార నుండి ప్రారంభమైన దమ్మయాత్ర బుద్ధవనం చేరుకొనిన దమ్మయాత్ర ముగింపు ఉత్సవాలలో భాగంగా మంగళవారం గగన్ మాలిక్ ఫౌండేషన్ అధ్యక్షులు గగన్ మాలిక్ ఆధ్వర్యంలో మహాస్తూపంలోని ధ్యాన మందిరంలో థాయిలాండ్ దేశం నుంచి తీసుకొచ్చిన ప్రత్యేక సామాగ్రి తో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధునికి బుద్ధ జ్యోతులను వెలిగించారు. అనంతరం ధ్యాన మందిరంలో ధ్యానం చేశారు. ఈ కార్యక్రమం అనంతరం ధమ్మా యాత్రలో పాల్గొన్న థాయిలాండ్, భారతదేశానికి చెందిన బౌద్ధ భిక్షువులు ఇతర బౌద్ధ మతస్తులు థాయిలాండ్ రాజ కుటుంబంతో కలిసి నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించారు. నాగార్జునకొండ మ్యూజియంలో మ్యూజియం క్యూరేటర్ కమలహాసన్ బౌద్ధ భిక్షులందరికీ మ్యూజియంలో భద్రపరిచిన బుద్ధ ధాతువులను వీక్షించే అవకాశాన్ని కల్పించారు. నాగార్జునకొండ మ్యూజియంలో భద్రపరిచిన బుద్ధ దాతువులను దర్శించి బౌద్ధ భిక్షువులు, బౌద్ధ మతస్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం వీరు నాగర్జున కొండలోని పునర్నిర్మిత మహాస్థూపాన్ని, సింహల విహారాన్ని సందర్శించారు. వీరితోపాటు బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, బుద్ధవనం ఆర్ట్స్ మరియు ప్రమోషన్స్ మేనేజర్ శ్యామ్ సుందర్ రావు , స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రపాలనగరంలో రంగుల సందడి సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ఆధ్వర్యంలో ఘనంగా హోలీ వేడుకలు

**రామన్నపేట అక్షిత ప్రతినిధి**



ఇంద్రపాలనగరం గ్రామంలో హోలీ పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మహిళలు, యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.వివిధ రంగులతో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ, మోదుగు పూలతో సంప్రదాయ హోలీ సంబరాలు జరుపుకున్నారు. డీజే చప్పుళ్ల మధ్య యువత నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాలతో పండుగను మరింత ఉత్సాహభరితంగా మార్చారు.ఈ సందర్భంగా సర్పంచ్ గర్దాస్ విక్రమ్ మాట్లాడుతూ హోలీ పండుగ అందరి జీవితాల్లో ఆనందం, ఐక్యత, సుఖశాంతులు నింపాలని ఆకాంక్షించారు. గ్రామంలో సామరస్య వాతావరణం కొనసాగాలని కోరుకున్నారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, వార్డ్ సభ్యుడు వరికుప్పల స్వామి, యువ నాయకులు సింగణబోయిన గణేష్ యాదవ్, చిన్నపాక శ్రీనివాస్, సింగణబోయిన జంగయ్య, మందడి విద్యాసాగర్ రెడ్డి, మందడి శ్రీధర్ రెడ్డి, కాటపల్లి సిద్ధమ్మ యాదయ్య, రేపాక సత్తయ్య, రాస వెంకటేష్, రవ్వ నర్సింహా, రాజన్నగారి రమేష్, మంటి లింగస్వామి, మంటి రమేష్, గోళ్లేపల్లి యాదయ్య, చిన్నపాక సురేష్, బొల్ల నర్సింహా, బొల్ల మచ్చి, కంబాలపల్లి శ్రీశైలం, నక్క వెంకటేష్, కొమ్మగోని సంజీవ, జిట్టబోయిన వెంకటేష్, బోనగిరి మధు, వెలిమినేటి నరేష్, బోనగిరి సంజీవ, గర్దాస్ శ్రీకాంత్, గడ్డం సాయి, గర్దాస్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


## ఇద్దరు పిల్లలను చంపి తాను ఆత్మహత్య చేసుకున్న తల్లి

**యాదాద్రి జిల్లాలో విషాదం...**

**మూడు పేజీల సూసైడ్ నోటు రాసిన మృతురాలు**

**ఇద్దరు పిల్లలను చంపి ఆత్మహత్య చేసుకున్న తల్లి..**

**యాదాద్రి భువనగిరి జిల్లా /అక్షిత న్యూస్:**



యాదాద్రి భువనగిరి జిల్లా గొల్లగూడెంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. భర్త,అత్తింటి వారి వేధింపులు తాళలేక ఓ వివాహిత.. బలవన్మరణానికి పాల్పడింది. అయితే తాను చనిపోయిన తర్వాత తన పిల్లలను ఎవరూ చూసుకోరని భావించిన,ఆ మహిళ..వారిని మొదట చంపేసి..ఆ తర్వాత తాను కూడా ప్రాణాలు విడిచింది. నవమాసాలు మోసి కన్న ఆ ఇద్దరు పసి పిల్లలను ఆ మహిళ చంపడం..ఇప్పుడు తీవ్ర హృదయ విదారకంగా మారింది.చనిపోవడానికి ముందు సూసైడ్ లెటర్ రాసిన ఆ మహిళ..తన భర్తతోపాటు అత్తింటివారిపై సంచలన ఆరోపణలు చేసింది.వారి వేధింపుల కారణంగానే తాను, తన పిల్లలతో కలిసి చనిపోతున్నట్లు పేర్కొంది. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు.పోలీసుల కథనం ప్రకారం,బీబీనగర్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల మహేశ్ యాదవ్,ఐశ్వర్య దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి.ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఐశ్వర్య,పిల్లలతో కలిసి తన పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే,కుటుంబ సభ్యులు ఆమెకు సర్దిచెప్పి సోమవారమే తిరిగి అత్తగారి ఇంటికి పంపించారు.కానీ, పుట్టింటి వారు వెళ్లిపోయిన కొద్దిసేపటికే ఆమె ఈ ఘోర నిర్ణయం తీసుకుంది.సోమవారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో,ఐశ్వర్య తన ఇద్దరు చిన్నారులను దిండుతో అదిమి ఊపిరాడకుండా చేసి చంపేసింది.బిడ్డల ప్రాణాలు పోయాయని నిర్ధారించుకున్నాక,అదే ఇంట్లో ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.ఈ హృదయ విదారక ఘటనతో గొల్లగూడెం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది..

## మంచితనాన్ని ఆహ్వానించే ఆత్మీయ సందేశమే హోలీ

**గ్రామ సర్పంచ్ కొమ్ము రవి**



**చేర్యాల అక్షిత ప్రతినిధి:**

సమాజంలో చెడును దహనం చేసి మంచితనాన్ని ఆహ్వానించి ఆత్మీయ సందేశం హోలీ వేడుక అని ఆకునూరు గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్ము రవి సూచించారు. మంగళవారం హోలీ పండుగ పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ కొమ్ము రవి గ్రామ మరియు మండల ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ  సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ... ప్రకృతిలో పూసే పూలలాగే మన జీవితాల్లో సంతోషాల రంగులు నింపే పండుగ హోలీ అని,చెడును దహనం చేసి మంచితనాన్ని ఆహ్వానించే ఆత్మీయ సందేశమే హోలీ పండుగని తెలిపారు. సమానత్వం, స్నేహం, సానుభూతికి ప్రతీకగా అందరం కలిసిమెలిసి జరుపుకునే ఈ రంగుల సంబరాల్లో మీ జీవితాలు కూడా విజయాలతో కళకళలాడాలని కోరుకున్నారు.

రంగుల హోలీ పండుగ మన సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం మరియు అభివృద్ధి సందేశాన్ని విస్తరించాలని అన్నారు.ప్రతి ఇంటా ఆనందం, ప్రతి గ్రామంలో అభివృద్ధి పథంలో రంగులు నిండాలని ఆకాంక్షిస్తూ  ప్రజలందరికీ చక్కటి సందేశాన్ని అందించిన సర్పంచ్ రవి.

## స్లింకర్  పైపులు మంజూరు

**ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతున్న మాజీ సర్పంచ్ వన్నోజ్ సత్యం**



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:**

పెద్దకొత్తపల్లి మండలం దేవల్ తిరుమలాపూర్ గ్రామంలోని 21 మంది రైతులకు వ్యవసాయ స్లింకర్ పైపులు మంజూరు కావడం జరిగింది.  స్లింకర్ పైపులను గ్రామ  మాజీ సర్పంచ్ వన్నోజ్ సత్యం ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వన్నోజ్ సత్యం  మాట్లాడుతూ  మంత్రి జూపల్లి కృష్ణారావు నిరంతర పర్యవేక్షణలో  తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి  ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశానుసారం పేద ప్రజలను ఆదుకోవడమే ధ్యేయంగా ముందుకు వెళుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేద ప్రజల పార్టీ అని వ్యవసాయ ఆధారిత రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా నూతన వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ లాభాదాయకంగా నడిపించాలని దృఢ సంకల్పంతో పనిచేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని ఏ స్కీము అయినా మన గ్రామనికి వచ్చే విధంగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ప్రజలకు రైతులకు ఎల్లప్పుడు తోడుగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ వార్డు మెంబర్లు గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# ఆవనగంటి గోపాల్ మృతి బాధాకరం

**బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఎడ్ల మహేందర్ రెడ్డి**

**రామన్నపేట అక్షిత ప్రతినిధి**



మండలంలోని వెల్లంకి గ్రామంలో ఆవనగంటి గోపాల్ అనారోగ్యంతో మరణించారు.విషయం తెలుసుకున్న జిల్లా బిఆర్ఎస్ నాయకుడు ఎడ్ల మహేందర్ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం 10,000 రూపాయలు మరియు గ్రామ సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాస్ 5000 రూపాయలు అవనిగంటి గోపాల్  కుమారుడైన ఆమనగంటి మహేష్ (గ్రామపంచాయతీ సిబ్బంది) కు ఆర్థిక సాయం అందజేసి గోపాల్ మృతదేహానికి  నివాళలు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఎడ్ల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గోపాల్ మరణించడం చాలా బాధాకరమని, ఆవనగంటి మహేష్ కుటుంబానికి అన్ని విధాలుగా అండదండగా ఉంటారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మిర్యాల రాజకుమార్, బిఆర్ఎస్ నాయకులు ఎడ్ల నరేందర్ రెడ్డి,వార్డు సభ్యులు సండ్ల లింగయ్య  మరియు పాశం సతీష్ రెడ్డి జింక శేఖర్ మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో ఖాళీ అయినా రెండు రాజ్యసభ స్థానాలను కాంగ్రెస్ పార్టీ వికలాంగులకే కేటాయించాలి

**అక్షిత న్యూస్ మునగాల**



మునగాల మండలం తిమ్మారెడ్డి గూడెం లో నిర్వహించిన సంఘం మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ డిమాండ్ తెలంగాణ రాష్ట్రంలో ఖాళీ అయిన రెండు రాజ్యసభస్థానాలను, సమాజంలో అత్యంత వెనుకబడిన మరియు రాజ్యాధికారానికి దూరమై దుర్భర జీవితాలు గడుపుతున్న వికలాంగుల సామాజిక వర్గానికి అవకాశం కల్పించేలా కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకోవాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు ఈ మేరకు మంగళవారం మునగాల మండలం తిమ్మారెడ్డి గూడెంలో ఏర్పాటుచేసిన సంఘం మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు గడుస్తున్నా, నేటికీ వికలాంగుల సమాజం దుర్భర జీవితాలు గడపటానికి కారణం వికలాంగులకు చట్టసభల్లో రాజకీయ అవకాశాలు లేకపోవటమేనని ముఖ్యంగా సకలాంగుల రాజకీయ నాయకులు వికలాంగుల సమాజాన్ని కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే వాడుకుంటూ చట్టసభల్లో వికలాంగుల సమస్యలు వినిపించని కారణంగానే నేటికీ దేశంలో వికలాంగుల సమాజం తమ సమస్యల పరిష్కారానికై పోరాటాలు చేస్తూ ఉండవలసిన దారుణ పరిస్థితి వచ్చిందని వికలాంగుల సమస్యలను చట్టసభల్లో వినిపించాలంటే వికలాంగుల సామాజిక వర్గానికి చెందిన వారే చట్టసభల్లో ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందని. ముఖ్యంగా దేశంలో రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలు ఆస్తులు, అంతస్తులు ఉన్నవారికే రాజ్యసభ సీట్లు ఇస్తుండటం వల్ల సామాన్య వికలాంగులు అభివృద్ధికి దూరమవుతున్నారని. అందుకే తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న రెండు స్థానాల్లో వికలాంగుల హక్కుల కోసం పోరాడే వ్యక్తులకు అవకాశం ఇచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వికలాంగుల పట్ల తన చిత్తశుద్ధిని చాటుకునేలా ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవాలని గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. ఒకవేళ వికలాంగుల విజ్ఞప్తిని నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి ఈదయ్య బాబు గుగులోతు సైదులు విద్యార్థి సంఘం నాయకుడు నూక హరికృష్ణ స్పెషల్ బీఈడీ అభ్యర్థుల సంఘం రాష్ట్ర నాయకులు వాంకుడోత్ లాల్ సింగ్  మునగాల మండల అధ్యక్షుడు గోపిరెడ్డి మదన్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా హోలీ పండుగ సంబరాలు

**పాల్గొన్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్**

**ఖమ్మం /అక్షిత బ్యూరో :**



ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో 7,28,29,30 వ వార్డులలో జిల్లా మరియు మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు ఘనం గా హోలీ పండుగను జరుపుకున్నారు. వసంత ఋతువుకు ఆహ్వానం.చెడుపై విజయం సాధించిన తరుణం  రంగు రంగుల సంబురాల వేడుక.ప్రేమ ఐక్యత స్నేహానికి ప్రతీక.హానికరమైన రసాయనాలకు దూరంగా ఉండి, సహజ సిద్ధమైన రంగులను వాడి మనసులను సప్తవర్ణ శోభితం చేసుకోవాలని కోరుకుంటూ జిల్లా ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్ మరియు 7 వ వార్డు కౌన్సిలర్ బుర్ర మహేష్ 29 వ వార్డు కౌన్సిలర్ వెంపటి ఉమా వెంకటేశ్వర్లు మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు నూకల రామ్మోహన్ రెడ్డి కొట్టం శిరీష రంజిత్ రెడ్డి షాబాదు సైది రెడ్డి కళ్లెం శేషిరెడ్డి ఉపేంద్ర రెడ్డి రాకేష్ రెడ్డి సురేష్ రెడ్డి ప్రసాద్ రెడ్డి నరేష్ రమేష్ కిరణ్ సతీష్ రెడ్డి వెంపటి కోటయ్య మురళి శివలింగం భద్రా చారీ తదితరులు ఉన్నారు.



www.aakshitha.com People's voice అక్షిత జాతీయ దినపత్రిక AKSHITHA NATIONAL DAILY



## శునకానికి ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు



**చేర్యాల అక్షిత ప్రతినిధి:** చేర్యాల పట్టణంలోని డెక్కన్ చాయ్ హోటల్ వద్ద సోమవారం రాత్రి మెయిన్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై అతివేగంగా వెళుతున్న ఓ వ్యక్తి శునకానికి ఢీకొని తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే గమనించిన స్థానికులు హుటా హుటిన గాయాలైన వ్యక్తిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆ వ్యక్తికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## జిల్లాలో నెల రోజులు అన్ని ఆరోగ్య కేంద్రాలలో ఉచిత వైద్య శిబిరాలు

**మహిళలు గర్భిణీలు బాలింతలకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు**

**పిల్లల ఆరోగ్య సంరక్షణకు బాల వైద్య నిపుణులు**

**ఎముకలు కీళ్ల సమస్యలకు ఆర్థోపెడిక్ వైద్యులు**

**కంటి దంత సమస్యల నిర్ధారణకు ప్రత్యేక నిపుణులు**

**ప్రతి రోగికి అవసరమైన పరీక్షలు ఉచితంగా మందుల పంపిణీ**

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ**

**నాగారం అక్షిత న్యూస్ :**



సూర్యాపేట జిల్లా పరిధిలో 04-03-2026 నుండి 31-03-2026 వరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేక వైద్య నిపుణుల పర్యవేక్షణలో విస్తృతస్థాయిలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ తెలిపారు. ప్రజలకు సమగ్ర వైద్య సేవలను వారి నివాస ప్రాంతాలకి అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను చేపడుతున్నట్లు అన్నారు. ఈ వైద్య శిబిరాలలో మహిళల ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం గైనకాలజిస్ట్ లు, పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం బాల వైద్య నిపుణులు, సాధారణ ఆరోగ్య పరిరక్షణ కోసం జనరల్ ఫిజీషియన్ లు, ఎముకల మరియు కీల సమస్యల కోసం ఆర్థోపెడిక్ నిపుణులు, కంటి సమస్యల నిర్ధారణ కోసం కంటి వైద్యులు, దంత సమస్యల పరిష్కారం కోసం పంటి వైద్య నిపుణులు, అందుబాటులో ఉంటారని తెలిపారు. శిబిరాలకు విచ్చేసే ప్రతి రోగికి అవసరమైన పరీక్షలు నిర్వహించి తగిన ఔషధాలు అందించబడతాయని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ శిబిరాలు ఏర్పాటు చేయబడుతున్నాయని, ముఖ్యంగా మహిళలు, గర్భిణీలు, బాలింతలు, వయోవృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, కంటి చూపు సమస్యలు ఉన్నవారు, పంటి నొప్పితో బాధపడుతున్న వారు అధిక సంఖ్యలో హాజరై తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ నివాస ప్రాంతానికి సమీపంలోని ఆరోగ్య కేంద్రాలలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా సంబధిత ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు, పారామెడికల్ సూపర్వైజర్లు, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో చికిత్స అవసరమైన వ్యక్తులను గుర్తించి శిబిరాలకు తరలించి సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు గ్రామ నాయకులు సామాజిక కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## హోలీ సంబరాలు విషాదం

**సూరారం పంతులు చెరువులో ఇద్దరు విద్యార్థుల మృతి**



**అక్షిత న్యూస్ / గాజులరామరం :**

రంగుల పండుగగా ఆనందోత్సాహాలతో ప్రారంభమైన హోలీ సాయంత్రానికి రెండు కుటుంబాల్లో కన్నీటి పర్వతాలను మిగిల్చింది. సరదాగా ఈత కొట్టేందుకు చెరువులో దిగిన ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థులు మునిగి మృతి చెందడంతో సూరారం ప్రాంతం శోకసంద్రంగా మారింది. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం పోలీస్ స్టేషన్ పరిధి పంతులు చెరువులో మంగళవారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. సూరారం విశ్వకర్మ కాలనీకి చెందిన సాగర్ (17), అభిషేక్ (17) తమ స్నేహితులు మమ్మాయి అజయ్ (17), విఘ్నేష్ (18), మేకల ఛత్రపతి (17) లతో కలిసి హోలీ వేడుకలు జరుపుకున్నారు. వీరందరూ సమీపంలోని బహదూర్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు.

హోలీ ఆడి ఆనందోత్సాహాలతో గడిపిన అనంతరం స్నానం చేయాలని భావించిన ఈ ఐదుగురు స్నేహితులు సమీపంలోని పంతులు చెరువు వద్దకు వెళ్లారు. చెరువులో నీరు ఎక్కువగా ఉండగా, సాగర్ మరియు అభిషేక్ ఇద్దరూ ఈత కొట్టేందుకు నీటిలోకి దిగారు. మిగతా ముగ్గురు యువకులు షాంపూ, సబ్బు కొనుక్కొచ్చేందుకు సమీప కిరాణా దుకాణానికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి చెరువులో మునుగుతూ కనిపించిన తమ స్నేహితులను చూసి వారు ఆందోళనకు గురయ్యారు. వెంటనే సూరారం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, సిఐ సుదీర్ నాయకత్వంలో డిఆర్ఎఫ్ సిబ్బంది సహాయంతో గాలింపు చేపట్టారు. కొంతసేపటి శ్రమ తర్వాత సాగర్, అభిషేక్ మృతదేహాలను చెరువులోనుంచి వెలికి తీశారు. మృతదేహాలకు పంచనామా నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రెండు కుటుంబాల్లో విషాదం

ప్రతిరోజూ కళాశాలకు వెళ్లే తమ కుమారులు తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారన్న వార్త విన్న తల్లిదండ్రులు విలపిస్తున్నారు. మృతుల్లో ఒకరి తండ్రి సూరారంలో ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తుండగా, మరొకరి తండ్రి కౌడిపల్లిలో వ్యవసాయం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హోలీ పండుగ రోజున జరిగిన ఈ దుర్ఘటన రెండు కుటుంబాలను దుఃఖంలో ముంచేసింది.

ఈ ఘటనతో సూరారం ప్రాంతమంతా విషాద ఛాయలు అలుముకున్నాయి. హోలీ సంబరాలు క్షణాల్లోనే శోకంగా మారడంతో స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

## బుద్ధుని మార్గం అనుసరణీయం

**ఎమ్మెల్యే బిఎల్ఆర్**



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**

శాంతి అహింస బుద్ధుని మార్గం నేడు ఆదర్శనీయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ అన్నారు. మంగళవారం రాత్రి అంబేద్కరిస్టులు, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక కళభారతి మినీ ఆడిటోరియంలో బుద్ధునితో నా ప్రయాణం నాటకంను బుద్ధుని, డాక్టర్ అంబేద్కర్ చిత్రపటాల ముందు జ్యోతి వెలిగించి ప్రారంబించి ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచంలో ద్వేషం, హింస ప్రవృత్తి పెరిగిందని వాటిని నివారించేందుకు బుద్ధుని బోధనలు మార్గనిర్దేశం చేస్తాయని, అంతటా శాంతి లోపించిందని అయన మార్గం నేడు అనుసరనియమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ జె. రాజు, డాక్టర్ మువ్వా రామారావు, మాలమహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్లపల్లి రవి ప్రశాంగించారు. నాయకులు చిలుకూరు బాలకృష్ణ, గుడిపాటి నవీన్ కళాకారుడు ప్రతాప్ పాల్గొన్నారు.

# నారాయణపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డితో రాహుల్ గాంధీ**

**నారాయణ పేట,అక్షిత ప్రతినిధి:**



నారాయణపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి కి సూచించారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి పర్యాటక ప్రాంతంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్షులతో సంఘటన సృజన్ అభియాన్ శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐసిసి అధినేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజ్ తదితరులు హాజరయ్యారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పార్టీ బలోపేతం ఇతర అంశాలపై దిశా నిర్దేశం చేసినట్లు డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి ముద్ర ప్రతినిధికి ఫోన్ ద్వారా తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించి పార్టీని మరింత పటిష్టం చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. అలాగే డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులతో రాహుల్ గాంధీ కొంతసేపు మాటా మంతి నిర్వహించారు.



# డబుల్ రోడ్డుపై రక్త హోలీ

**గుండ్లపల్లి - పొత్తూరు డబుల్ రోడ్డు నిర్మాణం పనులు వెంటనే చేపట్టాలి**

**కరీంనగర్ అక్షిత బ్యూరో :**

హ్యాపీ హోలీ అంటూ రంగుల పండుగ సంబరాలు చేసుకుంటుంటే, గన్నేరువరం మండలంలో డబుల్ రోడ్డుపై రక్త హోలీ జరుగుతుందని, అస్తవ్యస్తంగా అసంపూర్తి పనులతో జాప్యం అవుతున్న గుండ్లపల్లి -పోత్తూరు రోడ్డు నిర్మాణ పనులు తక్షణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ బిజెపి మానకొండూరు అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మొఖంపై రంగులు చల్లుకొని నడిరోడ్డులో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండ్లపల్లి -- పొత్తూరు రహదారి డబల్ రోడ్డు నిర్మాణం పట్ల కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఎండగట్టారు. గుండ్లపల్లి నుండి పొత్తూరు వరకు ఉన్న ఈ డబుల్ రోడ్డు కోసం దశాబ్దాలుగా ప్రజలు వేచి చూస్తున్నారనన్నారు. ప్రతి ఎన్నికల సమయంలో హామీలు ప్రతి ప్రభుత్వంలో శంకుస్థాపనలు చేసి చేతులు దులుపుకుంటే, ఇక్కడి ప్రజలకు మాత్రం గాయాలు, ప్రమాదాలే మిగిలాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం 71 కోట్ల రూపాయల జిఓ తీసుకొచ్చి శంకుస్థాపన చేసి ప్రచారంతో సరిపెట్టుకుందని విమర్శించారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే 100 రోజుల్లో రోడ్డు నిర్మిస్తా"అని హామీ ఇచ్చి, ఉన్న రహదారినే చెడగొట్టి కంకర



పోసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. నిత్యం ఆ కంకర రాళ్లు ఎగిరిపడి చిన్నారులు, వృద్ధులు గాయపడుతున్నారని. తన మొఖంపై ఉన్న హోలీ రంగులా ప్రజల ముఖాలపై రక్తపు మచ్చలు పడుతున్నాయన్నారు.. ఓట్లేసిన పాపానికి ప్రజలు రక్తం కళ్లతో చూడాలా అంటూ సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. వర్షాకాలం వస్తే మండలం మొత్తం జలదిగ్బంధనానికి గురవుతుందని, అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి తలెత్తుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారి కేవలం అసౌకర్యం కాదు-- ఇది ప్రాణహాని అని, ప్రతి రోజు ప్రమాదాల అంచున ప్రజలు జీవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి ప్రజల ప్రాణాలు కూడా విలువైనవేనని,ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో వెంటనే స్పందించి గుండ్లపల్లి పొత్తూరు డబల్ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

### అంగరంగ వైభవంగా ఫణిగిరి

## శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం

**వేద ఘోషల నడుమ అంగరంగ వైభవంగా తలంబ్రాల వేడుకలు**

**జైశ్రీరామ్ నినాదాలతో మార్మోగిన ఆలయ ప్రాంగణం**

**ఆలయ కమిటీ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్**

**గ్రామ సర్పంచ్ ఎర్ర సావిత్రి యాదగిరి**

**నాగారం అక్షిత న్యూస్ :**



మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో శ్రీశ్రీశ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం (తలంబ్రాలు) సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా, వేద ఘోషల నడుమ, భక్తి పరవశంతో అత్యంత ఘనంగా నిర్వహించబడింది. గ్రామ దేవాలయ ప్రాంగణం ఉదయం నుంచే ప్రత్యేక శోభనం సంతరించుకుంది. ఆలయాన్ని పుష్పాలతో, విద్యుత్ దీపాలతో అలంకరించగా, సాయంత్రానికి గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. ముందుగా స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేకం, అర్చనలు, ప్రత్యేక అలంకార సేవలు నిర్వహించగా, అనంతరం శాస్త్రోక్తంగా కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల దివ్య కళ్యాణం జరగగా, తలంబ్రాల ఘట్టం భక్తులతో అపారమైన ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది. తలంబ్రాలు చల్లుకునే పవిత్ర క్షణంలో ఆలయ ప్రాంగణం "జైశ్రీరామ్"నినాదాలతో, మార్మోగి, భక్తుల ఆనందోత్సవానికి అద్దం పట్టింది. కళ్యాణ మహోత్సవాన్ని దర్శించుకునేందుకు గ్రామ ప్రజలతో పాటు, పరిసర సమీప గ్రామాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. దంపతులు కుటుంబ సౌఖ్యం, ఐశ్వర్యం, సంతాన సౌపల్యం, ఆరోగ్య సంపదల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయగా, యువత స్వామి వారిని దర్శించుకొని ఆశీర్వాదాలు పొందంది. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ కళ్యాణ మహోత్సవం గ్రామ ప్రజల్లో ఐక్యతను, పరస్పర సహకారాన్ని పెంపొందించడమే కాకుండా సనాతన ధర్మ పరిరక్షణకు వేదికగా నిలుస్తోందని నిర్వాహకులు తెలిపారు. భక్తి భవ్యత్వం, సంప్రదాయ సౌందర్యం కలిసిన ఈ శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం ఫణిగిరి గ్రామ ఆధ్యాత్మిక చరిత్రలో శిరస్మరణీయ ఘట్టంగా నిలిచిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్, గ్రామ సర్పంచ్ ఎర్ర సావిత్రి యాదగిరి,ఉపసర్పంచ్ వల్లాల భానుప్రకాష్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పానుగంటి నర్సింహారెడ్డి, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు ఆలకుంట్ల బాలకృష్ణ, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కసిరెడ్డి రాంరెడ్డి, టిపిసిసి సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షులు ఎర్ర అనుదీప్ కుమార్, మాజీ ఎంపీటీసీ నాతి పద్మ వీరమల్లు, మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ నాతి వెంకన్న, సింగిల్ విండో డైరెక్టర్ రావుల సత్తయ్య, తిరుమలగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జంపాల రవి,ముదిరెడ్డి శేఖర్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రావుల లింగయ్య, మందుల వెంకన్న, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### ఐఐటి హైదరాబాద్ కెమికల్ ఇంజనీరింగ్

## విభాగంలో ఇండస్ట్రీ సమ్మిట్--2026

**సంగారెడ్డి అక్షిత బ్యూరో:**




ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటిహెచ్) కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో తొలి ఇండస్ట్రీ సమ్మిట్--2026 ఘనంగా జరిగింది. చమురు--శక్తి, పదార్థాలు, తయారీ, ఔషధ రంగాలకు చెందిన దాదాపు 40 ప్రముఖ పరిశ్రమల నుంచి సుమారు 100 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. పరిశ్రమ--అకాడెమియా మధ్య బలమైన భాగస్వామ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ సమ్మిట్ నిర్వహించారు. స్థిరత్వం, స్వచ్ఛ శక్తి, ఉత్ప్రేరకాలు, ఆరోగ్య సాంకేతికతలు, కీలక ఖనిజాలు, అధునాతన పదార్థాలు, ఏఐ, ఎంఎల్ ఆధారిత కెమికల్ ఇంజనీరింగ్ వంటి అంశాలపై పరిశోధన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోస్టర్ సెషన్లు, ల్యాబ్ సందర్శనలు పరిశ్రమ--పరిశోధకుల మధ్య ప్రత్యక్ష చర్చలకు దోహదపడ్డాయి. విక్సిత్ భారత్ కోసం కార్యాచరణ పరిశ్రమ--విద్యా ఫ్రేమ్‌వర్క్ పై జరిగిన ప్యానెల్ చర్చలో, సహ-అభివృద్ధి పరిశోధన, పరిశ్రమలోనే ఇంటర్న్‌షిప్‌లు, ఉమ్మడి డాక్టోరల్ మార్గదర్శకత్వం వంటి ఫలితాల ఆధారిత భాగస్వామ్యాల అవసరాన్ని నొక్కి చెప్పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోల్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ (టెక్నికల్) అచ్యుత్ ఘటక్, పరిశోధన వాణిజ్యీకరణతోనే దేశ వృద్ధి సాధ్యమని తెలిపారు. నికర సున్నా ఉద్గారాల లక్ష్యంతో ఐఐటిహెచ్‌లో ఏర్పాటైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు తమ మద్దతు కొనసాగుతుందని ప్రకటించారు. ఐఐటిహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి వీడియో సందేశంలో, జాతీయ పారిశ్రామిక ప్రాధాన్యతలతో పరిశోధనను అనుసంధానించాల్సిన అవసరాన్ని వివరించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ చంద్రశేఖర్ శర్మ ఈ సమ్మిట్‌ను పరిశ్రమ నిశ్చితార్థంలో కీలక మైలురాయిగా అభివర్ణించారు. విద్యార్థి శిక్షణ, ప్రాయోజిత పరిశోధన, ఉమ్మడి కేంద్రాలు, సాంకేతిక బదిలీ వంటి అంశాలపై కార్యాచరణతో ఈ సమ్మిట్ ముగిసింది. భవిష్యత్తులో దీన్ని వార్షిక వేదికగా కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఇస్నాపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మాధవికి భారీ షాక్...

**ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ సభ్యత్వం రద్దు**

**బీఆర్ఎస్ కు మద్దతు ఇవ్వడమే కారణం**

**జిల్లా అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి ఫిర్యాదును పరిశీలించి చర్యలు తీసుకున్న కలెక్టర్ ప్రావిణ్య**



**పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి:**

పటాన్‌చెరు పరిధిలోని ఇస్నాపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మాధవికి షాక్ తగిలింది.మాధవి సభ్యత్వాన్ని రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి నిర్ణయం తీసుకున్నారు.ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఇస్నాపూర్ ఎనిమిదో వార్డు నుంచి మాధవి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గెలుపొందారు.అయితే మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సమయంలో ఆమె బిఆర్ఎస్ పార్టీకి మద్దతు పలికారు.ఈ విషయాన్ని గ్రహించిన డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇస్నాపూర్ ఎనిమిదో వార్డు మాధవి సభ్యత్వాన్ని రద్దు చేస్తూ నిర్ణయాన్ని వెలుపరిచారు. ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్ గా నిలిచింది.

## కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డికి హోలీ శుభాకాంక్షలు



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి**

కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి కి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలపడం జరిగింది .ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ ముదిరాజ్ డిసిసి ఉపాధ్యక్షులు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి ఆమనగల్ మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ కల్వకుర్తి మాజీ జెడ్పిటిసి సభ్యులు అశోక్ రెడ్డి .కృష్ణా నాయక్ అలీమ్ .రామకృష్ణ. ఫరీద్ .లక్ష్మణ్ నాయక్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" అమలుపై సీఎం సమీక్ష సమావేశంలో పేట కలెక్టర్



**నారాయణ పేట అక్షిత, ప్రతినిధి:**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు అమలు చేయనున్న "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంపై మంగళవారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జిల్లాల కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు.కార్యక్రమం సమర్థవంతంగా అమలు కావడానికి తీసుకోవాల్సిన చర్యలు, శాఖల సమన్వయం, ప్రజలకు చేరువగా పరిపాలన అందించే విధానాలపై ముఖ్యమంత్రి సమగ్రంగా చర్చించారు.

జిల్లా స్థాయిలో ప్రణాళికను విజయవంతంగా అమలు చేయడానికి అవసరమైన కార్యాచరణపై దిశానిర్దేశం అందించినట్లు తెలిపారు.

Edited, Printed, Published & Owned by Mathangi Guruvaiah, and Printed at Spoorthi Publications, H.No.7-1059/1, Bangarugadda, Miryalaguda, Nalgonda District - Telangana, and Published at H.No.7-1059/1,Bangarugadda, Miryalaguda, Nalgonda District - Telangana. Editor : Mathangi Guruvaiah, Email : akshithadaily@gmail.com, Cell: 9000556444 RNI NO.APTEL/2011/37073